ప్రజాశక్తి

ఆదివారం 22 జనవరి 2023

8 పేజీలు

విశాఖపట్నం

అనకాపల్లి

స్మార్ట్ మీటర్లు వద్దే వద్దు

- ఎపిఇఆర్‌సి ప్రజాభిప్రాయ సేకరణలో పలువురు అభ్యంతరం
- ట్రూ అప్ ఛార్జీలు ప్రభుత్వమే భరించాలి : సిపిఎం నేత లోకనాథం

పబ్లిక్ హియరింగ్‌లో మాట్లాడుతున్న సిపిఎం నాయకులు లోకనాథం (స్క్రీన్‌పై)

ప్రజాశక్తి-అనకాపల్లి ప్రతినిధి

వ్యవసాయ పంపు సెట్లకు, గృహ వినియోగ సర్వీసులకు స్మార్ట్ మీటర్ల ఏర్పాటుపై పలువురు అభ్యంతరం వ్యక్తం చేశారు. ప్రస్తుత మీటర్లు పనిచేస్తుండగా మార్చాల్సిన అవసరమేముందని ప్రశ్నించారు. డిస్కాంలు ప్రతిపాదించిన 2023-24 వార్షిక ఆదాయ, అవసరాలు, రిటైల్ ధరలు (ఎఆర్ఆర్)పై ఇపిడిసిఎల్ కార్పొరేట్ కార్యాలయం నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా మూడు రోజులుగా ఆంధ్రప్రదేశ్ విద్యుత్ నియంత్రణ మండలి (ఎపిఇఆర్‌సి) నిర్వహించిన ప్రజాభిప్రాయ సేకరణ శనివారంతో ముగిసింది. ఇఆర్‌సి ఛైర్మన్ జస్టిస్ సివి.నాగార్జున రెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో వినియోగదారుల మేలు కంటే మీటర్ల ఉత్పత్తిదారులైన అదానీ వంటి పెట్టుబడిదారులకు లబ్ధి చేకూర్చేందుకే ప్రభుత్వం మీటర్లు ఏర్పాటు చేయాలని చూస్తుందన్నారు. సిపిఎం అనకాపల్లి జిల్లా కార్యదర్శి కె.లోకనాథం మాట్లాడుతూ శ్రీకాకుళం జిల్లాలో ప్రయోగాత్మకంగా వ్యవసాయ పంపుసెట్లకు బిగించిన మీటర్ల అనుభవం బహిర్గతం చేయాలన్నారు. ట్రూ అప్ ఛార్జీలను వినియోగదారుల నుంచి వసూలు చేయకుండా, ప్రభుత్వమే భరించేలా సిఫార్సు చేయాలన్నారు. గృహ వినియోగదారులను ఫిక్స్‌డ్ ఛార్జీల నుంచి మినహాయించాలన్నారు. ఏజెన్సీలోని ఐదో షెడ్యూల్ ప్రాంతంలో గ్రీన్ ఫీల్డ్ ఎనర్జీ పేరుతో హైడల్ పవర్ ప్రాజెక్టుల ఏర్పాటును అదానీ, ఇతర ప్రయివేటు కంపెనీలకు ప్రభుత్వం అప్పగించడం చట్టవిరుద్ధమన్నారు. పవర్ ప్రాజెక్టులతో గిరిజనులు నిర్వాసితులవుతారని ఆందోళన వ్యక్తంచేశారు. ఎపి రైతు సంఘం మిగతా 2లో..

ముగిసిన 'ఇన్ఫినిటీ వైజాగ్'

ఐటి అభివృద్ధికి విస్తృత అవకాశాలు : మంత్రి అమర్‌నాథ్

మాట్లాడుతున్న అమర్‌నాథ్

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : ఐటి రంగం అభివృద్ధికి విశాఖలో విస్తృత అవకాశాలున్నాయని రాష్ట్ర ఐటి, పరిశ్రమల శాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ అన్నారు. ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ అసోసియేషన్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ (ఐటిఎపి), సాఫ్ట్‌వేర్ టెక్నాలజీ పార్క్ ఆఫ్ ఇండియా (ఎస్‌టిపిఐ) ఆధ్వర్యంలో ఎపి ఎలక్ట్రానిక్స్ అండ్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ సహకారంతో నగరంలోని ఓ హోటల్‌లో రెండు రోజులుపాటు నిర్వహించిన ఇన్ఫినిటీ వైజాగ్ - 2023 ఐటి సదస్సు శనివారంతో ముగిసింది. చివరి రోజు కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ రానున్న కాలంలో విశాఖకు ఐటి సంస్థలు క్యూకట్టనున్నాయన్నారు. సుమారు మూడు వేల మంది ఇన్ఫోసిస్ ఉద్యోగులు నగరంలోని 50 కిలోమీటర్ల పరిధిలో పనిచేస్తున్నారని, వారంతా తిరిగి ఇతర నగరాలకు వెళ్లేందుకు సిద్ధంగా లేరని తెలిపారు. కోవిడ్ అనంతరం పరిస్థితుల్లో చాలా మార్పులు వచ్చాయని, ప్రతి ఏడాదీ వేల మంది ఇంజినీర్లు రిలీవ్ అవుతున్నారని, వారంతా టైర్ - 2, టైర్ - 3 సిటీల్లోని సంస్థల్లో పనిచేసేందుకు మొగ్గు చూపుతున్నారని అన్నారు. మార్చి 3, 4 తేదీల్లో గ్లోబల్ ఇన్వెస్టర్ సమ్మిట్, 28, 29, 30 తేదీల్లో జి - 20 సమావేశాలు విశాఖలో జరగనున్నాయన్నారు. దీంతో ప్రపంచం దృష్టిని విశాఖ ఆకర్షించబోతోందన్నారు. సరిగ్గా మిగతా 2లో..

హాట్ మెటల్ ఉత్పత్తిలో స్టీల్‌ప్లాంట్ రికార్డు

▶ వార్త మెయిన్‌లో..

ప్రత్యేక హోదా సాధనకు ఐక్య పోరాటం

▶ వార్త మెయిన్‌లో..

మొదటి పేజీ తరువాయి..

స్మార్ట్ మీటర్లు వద్దే వద్దు

జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కర్రి అప్పారావు, ఎం.అప్పలరాజు మాట్లాడుతూ రైతుల స్థితిగతులను పరిగణనలోకి తీసుకొని పంపుసెట్లకు మీటర్ల ఏర్పాటును వెనక్కు తీసుకోవాలని కోరారు. మీటర్ల ఏర్పాటుతో ఉచిత విద్యుత్ నుంచి ప్రభుత్వం వైదొలుగుతుందన్న భయం రైతుల్లో వ్యక్తమవుతోందన్నారు. బెల్లం క్రషర్లకు ఉచిత విద్యుత్ కొనసాగించి, రైతులు, వినియోగదారులకు మంచి సేవలందించిన ఆర్‌ఇసిఎస్‌ను పునరుద్ధరించాలన్నారు. సిఐటియు సీనియర్ నాయకులు జిఎస్.రాజేశ్వరరావు మాట్లాడుతూ స్మార్ట్ మీటర్ల ఏర్పాటుతో రాష్ట్రంలోని 5 వేల మంది మీటర్ రీడర్లు వీధిన పడతారని తెలిపారు. డిస్కాంల్లో పనిచేసిన కాంట్రాక్టు ఉద్యోగులకు వేతనాల్లో తేడా లేకుండా చెల్లించాలన్నారు. ఈ సమావేశంలో ఎపిఇఆర్‌సి సభ్యులు ఠాకూర్ రామ్‌సింగ్, పి.రాజగోపాల్‌రెడ్డి, ఇపిడిసిఎల్, ఇన్‌ఛార్జ్ ఎస్‌పిడిసిఎల్ సిఎమ్‌డి కె.సంతోషరావు, సిపిడిసిఎల్ సిఎమ్‌డి జె.పద్మ జనార్ధన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

తప్పుడు నివేదిక సమర్పించిన ఎపిఇపిడిసిఎల్ అధికారులు

కలెక్టరేట్ (విశాఖ) : విద్యుత్ ఛార్జీల పెంపు, స్మార్ట్ మీటర్ల ఏర్పాటు వంటి అంశాలపై ప్రజల నుంచి అభిప్రాయం సేకరించే నిమిత్తం ఎపిఇఆర్‌సి నిర్వహించిన ప్రజాభిప్రాయ సేకరణ కార్యక్రమంలో ఎపిఇపిడిసిఎల్ అధికారులు రూపొందించిన నివేదిక బూటకమని సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి జెవి.సత్యనారాయణ మూర్తి అన్నారు. వ్యవసాయానికి ఉచిత విద్యుత్ కోటా నుంచి ఆర్జిస్తున్న రూ.1839.89 కోట్లలో రూ.834 కోట్లు పక్కదారి పడుతున్నాయని, కేవలం 0.26 శాతం మీటర్ రీడింగ్‌తో 99.74 శాతం విద్యుత్ వినియోగాన్ని అంచనా వేయడం ఏమిటని ప్రశ్నించారు. శనివారం పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. తప్పుడు నివేదికను రద్దు చేసి ప్రజాభిప్రాయ సేకరణను ప్రజల సమక్షంలో నిర్వహించాలని విజ్ఞప్తి చేశారు.

ముగిసిన 'ఇన్ఫినిటీ వైజాగ్'

రెండు నెలల్లో విశాఖ పరిపాలనా రాజధాని కాబోతోందని తెలిపారు. ఎపి ఎలక్ట్రానిక్స్ అండ్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ గ్రూపు సిఇఒ ఎస్.కిరణ్ రెడ్డి మాట్లాడుతూ భోగాపురం వద్ద 90.1 ఎకరాల్లో ఐటి పార్క్‌కు త్వరలో ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి శంకుస్థాపన చేయనున్నట్టు తెలిపారు. తిరుపతి సమీపంలోని పల్లం వద్ద 527 ఎకరాల్లో, ఎంపోడు వద్ద 447.47 ఎకరాల్లో నూతన ఐటి పార్కుల నిర్మాణం జరుగుతోందన్నారు. బెంగళూరుకు అతి దగ్గరలో సత్యసాయి జిల్లా తెలుకొడు వద్ద 394.27 ఎకరాల్లో పిపిపి పద్ధతిన ఐటి పార్క్ నిర్మాణానికి ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. ఐటి రంగం విస్తృతికి ప్రణాళికలు రచిస్తున్నామని తెలిపారు. సదస్సులో ఐటిఎఎపి గౌరవ అధ్యక్షురాలు లక్ష్మీ మొక్క, రాష్ట్ర అధ్యక్షులు శ్రీధర్ కొసరాజు, అమరావతి ఛాప్టర్ ప్రెసిడెంట్ ఎస్.నరేంద్ర కుమార్, ఎపి ఐటి అడ్వైజర్లు దేవిరెడ్డి శ్రీకాంత్ రెడ్డి, చంద్రహాస్, ఎస్‌టిపిఐ డైరెక్టర్ సివిడి.రాంప్రసాద్, ఎపి ఎన్ఆర్ఐ ఐటి అడ్వైజర్ మేడపాటి వెంకట్ పాల్గొన్నారు.

ఎయులో ఉమెన్స్‌కు 'విద్యాతరంగిణి'

- సరికొత్త హంగులతో వర్సిటీ ప్రాంగణంలో హాస్టల్
- పాత భవనాలను ఆధునీకరిస్తున్నాం
- రెండు విభాగాలను అందుకే తరలించాం : వీసీ ప్రసాద రెడ్డి

సరికొత్త హంగులతో విద్యాతరంగిణి భవనం

ప్రజాశక్తి - గ్రేటర్ విశాఖ బ్యూరో

ఎయులో నాటి 'విద్యాభవన్'.. నేడు విద్యాతరంగిణిగా మారింది. ఇంకా ముందు సంవత్సరాలకు వెళితే దూర విద్యా కేంద్రం (స్కూల్ ఆఫ్ ఎడ్యుకేషన్) కూడా ఇక్కడే ఉండేది. ఈ భవనం నిర్మించి 40 ఏళ్లు దాటిపోవడంతో ఆంధ్రా యూనివర్సిటీ యాజమాన్యం దృష్టిసారించి 'విద్యా భవన్‌కు సరికొత్త హంగులు అద్దింది. ఎయుపై పూర్వీకులు ఉంచిన నమ్మకాన్ని వమ్ము చేయకుండా 'విద్యా తరంగిణి' అనే పేరున పాత భవనాన్నే రూ.40 లక్షలతో ఆధునీకరించి ఆ భవనానికి 'న్యూ లుక్'ను తెచ్చిపెట్టడం చెప్పుకోదగ్గ విశేషం.

ఎయులో అసలేం జరుగుతోంది ?

యూనివర్సిటీలో హిందీభవన్, తెలుగు డిపార్టుమెంట్‌ల మధ్యలో ఎడ్యుకేషన్ డిపార్టుమెంట్, సంస్కృతం విభాగం ఒకే భవంతిలో కింద, పైనా ఉండేవి. 'విద్యాభవన్' అనే పేరుతో ఈ భవనం దర్శనమిచ్చేది. రెండు నెలల క్రితం ఈ రెండు విభాగాలను ఎయు వైస్ ఛాన్సలర్ ప్రసాదరెడ్డి ఎదురుగా ఉండే ఆర్ట్స్ కాలేజీ ప్రాంగణంలోకి తరలించారు. సుమారు 50 వేల చదరపు అడుగుల వైశాల్యంగల ఈ భవంతిని నాటి నుంచీ ఆధునీకరించే ప్రయత్నం చేశారు. ప్రస్తుతం ఈ భవనం పెయింటింగులతో సరికొత్త రూపం దాల్చింది. ఈ భవనానికి ఎడమ వైపున ఉన్న ఖాళీ ప్రదేశంలో లోపలకు వాహనాలు ప్రవేశించేందుకు వీలుగా రహదారి, గార్డెనింగ్ కోసం సైతం తాజాగా చకచకా పనులు జరుగుతున్నాయి. ఈ పాత భవనాన్ని దాతలిచ్చిన రూ.40 లక్షలతో సరికొత్తగా నిర్మాణం చేసి 294 మంది ఎయు విద్యార్థినులకు హాస్టల్‌గా మార్చినట్టు వీసీ ప్రసాదరెడ్డి 'ప్రజాశక్తి'కి తెలిపారు. ఎయు ఉమెన్స్ హాస్టల్‌కు ఈ భవనాన్ని ఉపయోగించడం తమకెంతో ఆనందంగా ఉందని, పైగా ఎయు ప్రాంగణంలోనే ఉండడం.. తమకు క్లాసులకు వెళ్లడం, అక్కడి నుంచి వచ్చాక చదువుపై దృష్టిపెట్టడం సులభంగా ఉందంటూ క్లాసుల నుంచి వచ్చి పోయే విద్యార్థినులు వెల్లడించారు. ప్రస్తుతం ఎయు ఉమెన్స్ హాస్టల్ జిల్లా పరిషత్ వద్ద ఉంది. వర్సిటీలో వివిధ ఫ్యాకల్టీల సంఖ్య పెరగడంతో రెండు తెలుగు రాష్ట్రాల నుంచీ విద్యార్థులు వస్తున్నారు. ఆదివారం ఇక్కడ చినజీయర్ స్వామితో మొక్కలు నాటించే కార్యక్రమాన్ని కూడా వీసీ నిర్వహిస్తున్నారు.

జరుగుతున్న ప్రచారం ఏంటి ?

రాష్ట్ర పాలనా రాజధానిగా విశాఖ ఉంటుందన్న ప్రతిపాదన నేపథ్యంలో ఆంధ్రా యూనివర్సిటీలో ఇంజినీరింగ్, ఆర్ట్స్ విభాగాలను యాజమాన్యం తరలింపు చేస్తుందన్న ప్రచారం తాజాగా ఊపందుకుంది. విద్యార్థులను రెండు డిపార్టుమెంట్ల నుంచి ఒకే భవనంలోగల ఎడ్యుకేషన్, సంస్కృతం విభాగాలను తరలించిన మాట నిజమే అయినా వారిని బయటకు పంపకుండా ఆర్ట్స్ కాలేజీలోనే ఆయా విభాగాలు ఉండేలా ఏర్పాట్లు చేశారు. ఇంకా అనేక భవనాలను ఎయులో సరికొత్తగా తీర్చిదిద్దుతున్నారు. ఖాళీ ప్రదేశాలను సైతం పూర్తిస్థాయిలో వినియోగించేందుకు దాతల సాయంతో అభివృద్ధి చేస్తున్నారు. పాత విద్యాభవన్‌ను పూర్తిగా నిర్మాణం చేయాలంటే 50 వేల ఎస్ఎఫ్‌టికి రూ.12 కోట్ల మేర ఖర్చవుతుంది. కానీ రూ.40 లక్షలతో సరికొత్త హంగులను తీసుకొచ్చారు. ఈ విభాగాలను తరలించనంత వరకూ విద్యాభవన్‌లోగల ఎడ్యుకేషన్ డిపార్టుమెంట్‌లో 13 మంది విద్యార్థులు, ముగ్గురు ఫాకల్టీలే ఉండేవారు. సంస్కృత విభాగం ఒక అధ్యాపకునితో 10 సంవత్సరాల పాటు ముగ్గురు స్టూడెంట్స్‌తోనే నడవడంతో ఈ భవనంపై ఎయు యాజమాన్యం దృష్టి సారించి మార్చేసినట్లు తెలుస్తోంది. అలాగే గత పదేళ్లలో 200 మంది ఎడ్యుకేషన్ డిపార్టుమెంట్ నుంచి, సంస్కృతం విభాగం నుంచి 50 మంది మాత్రమే చదువుకుని బయటకొచ్చారు. గతంలోని విద్యా భవన్‌కు నేడు విద్యాతరంగిణి అని పేరుపెట్టినట్లు వీసీ చెబుతున్నారు.

లోకేష్ పాదయాత్రతో జగన్‌లో భయం

ప్రజాశక్తి - కలెక్టరేట్ : అనుమతులు ఇచ్చినా, ఇవ్వకపోయినా కుప్పంలో ఈ నెల 27న ఉదయం 11 గంటలకు నారా లోకేష్ పాదయాత్ర మొదలవుతుందని, ఆ యాత్ర పట్ల సిఎం జగన్‌లో భయం మొదలైందని మాజీ ఎమ్మెల్సీ, టిడిపి ఉత్తరాంధ్ర జిల్లాల ఇన్‌ఛార్జి బుద్దా వెంకన్న తెలిపారు. శనివారం విశాఖలోని పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. 'మా టార్గెట్ లోకేష్' అని జగన్ అన్నారని, దీనిని బట్టి లోకేష్ మీద దాడులు చేస్తారనే అనుమానాలు కలుగుతున్నాయని తెలిపారు.

పోర్టు ఆసుపత్రి ప్రైవేటీకరణ ఆపాలి

ప్రజాశక్తి - కలెక్టరేట్ : ఈ నెల 19న విశాఖపట్నం పోర్టు అథారిటీ బోర్డు రహస్యంగా నిర్వహించిన సమావేశంలో పోర్టు గోల్డెన్ జూబ్లీ హాస్పిటల్ (జిజెహెచ్)ను పిపిపి పద్ధతిలో ప్రైవేటుపరం చేయాలని, కార్గో హ్యాండ్లింగ్ డివిజన్ (సిహెచ్‌డి)లో పనిచేస్తున్న 347 బ్యాచ్ క్యాజువల్ కార్మికులను తొలగించాలని విశాఖపట్నం పోర్టు బోర్డు నిర్ణయించినట్టు తెలిసిందని యునైటెడ్ పోర్ట్ అండ్ డాక్ ఎంప్లాయీస్ యూనియన్, విడిఎల్‌బి అండ్ డాక్ వర్కర్స్ యూనియన్ (సిఐటియు) అధ్యక్షులు జె.సత్యనారాయణ, సాంబ మూర్తి, ప్రధాన కార్యదర్శులు కె.సత్య నారాయణ బి.లక్ష్మణరావు సంయుక్త ప్రకటనలో శనివారం తెలిపారు. ఇటువంటి నిరంకుశ చర్యలను ఎట్టి పరిస్థితు ల్లోనూ తాము అంగీకరించ బోమని స్పష్టం చేశారు.

విశాఖలో ఉత్తరాది ప్రగల్భాలా ?

ప్రజాశక్తి - గ్రేటర్ విశాఖ బ్యూరో

విశాఖ, ఉత్తరాంధ్ర ప్రాంతం వెనుకబడడానికి 'శకుని' పాత్ర పోషిస్తోన్న బిజెపి, ఆ పార్టీ నేతలు ఉత్తర భారతదేశం ఉత్సవాలను విశాఖలో నిర్వహిస్తున్నారంటే ఎంత బరితెగింపన్నది మాటలతో చెప్పలేం. ఉత్తరప్రదేశ్ నుంచి రాజ్యసభ సభ్యునిగా బిజెపి తరపున ఎంపికైన జివిఎల్.నరసింహారావు గడచిన కొద్ది నెలలుగా విశాఖ కేంద్రంగా 'కాషాయ మూకల' ఉనికి కోసం శతవిధాలా కుయుక్తులతో కదులుతున్న విషయం తెలిసిందే. అంతేగాక విశాఖపై ఈ 'ఉత్తర కుమారుడు' వల్లమాలిన ప్రేమ ఒలకబోస్తూ గొంతు చించుకుంటున్నారు. ఇక్కడి ప్రభుత్వ రంగ పరిశ్రమలపై అవాకులు, చెవాకులూ పేలుతూ చిచ్చుపెట్టే ప్రయత్నాలు ఆరంభించారు. కేంద్రంలో అధికారం వెలగబెడుతూ విశాఖలోగల స్టీల్‌ప్లాంట్, పోర్టు ప్రైవేటీకరణ దిశగా ప్రయాణించేలా పావులు కదుపుతూ ఉత్తరప్రదేశ్, బీహార్ ఇతర రాష్ట్రాల నుంచి వచ్చి ప్రభుత్వ రంగ సంస్థల్లో పనిచేస్తున్న వారి ఓట్లకు గాలం వేసేందుకు చూస్తున్నారు. విశాఖ ఎంపీగా భవిష్యత్ ఎన్నికల్లో పోటీలో దిగేందుకు జివిఎల్ చూపిస్తోన్న అత్యుత్సాహం అంతా ఇంతా కాదు. ఉత్తరప్రదేశ్ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవాన్ని విశాఖలోని కోరమండల్ గేటు ఎదురుగా శ్రీహరిపురం జివిఎంసి పార్కులో ఆదివారం సాయంత్రం నిర్వహించేందుకు కాషాయమూకలు సిద్ధమయ్యాయి. బిజెపికి చెందిన కేంద్ర మంత్రులు, రాష్ట్ర నేతల పర్యటనలతో విశాఖను ఇప్పటికే అట్టుడికించేలా మోడీ సర్కారు చేస్తోంది. కేంద్ర విధానాలతో ప్రతిష్టాత్మకమైన వైజాగ్ స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా జరుగుతున్న కార్మిక, ప్రజా పోరాటాన్ని పక్కదారి పట్టించే చర్యలు దీని వెనుక లేకపోలేదు. ఈ ప్రాంతానికి జరుగుతున్న నష్టాన్ని కప్పిపుచ్చేలా ఊదరగొట్టుడు ఉపన్యాసాలతో పబ్బం గడుపుకోవడం కొట్టొచ్చినట్టు కనిపిస్తోంది.

విశాఖలో.. ఉత్తరప్రదేశ్ రాష్ట్ర దినోత్సవాన్ని జరపడం ఏమిటి?

విశాఖ అంటేనే ప్రభుత్వ రంగ సంస్థలకు, భారీ ప్రైవేట్ పరిశ్రమలకు కేంద్రం. కాస్మోపాలిటన్ సిటీ కావడంతో అందరూ (దేశంలో వివిధ రాష్ట్రాలకు చెందిన వారూ) ఇక్కడే నివాసం ఉంటున్నారు. అయితే ఉత్తరప్రదేశ్ రాష్ట్రం నుంచి సదరు జివిఎల్ రాజ్యసభ సభ్యుడు కావడం మాత్రమే జివిఎల్‌కు అర్హత అనుకుంటే పొరపడినట్టే. రాబోయే సార్వత్రిక ఎన్నికల్లో విశాఖలో ఎంపీగా మకాం వేసి ఇక్కడ ప్రభుత్వ రంగ పరిశ్రమలను కార్పొరేట్లకు అప్పగించే పథకంతో దీంట్లో దాగి వుంది. ఈ ప్రాంత జీవనంలోగల 'బహుళత్వం'ను దెబ్బతీసే చర్యలు తెరవెనుక ఉంటాయనడంలో ఎలాంటి సందేహమూ లేదు. విశాఖలోని కొంతమంది పారిశ్రామిక సంస్థల అధినేతలు సైతం ఇదే విషయంపై చర్చించుకోవడం తాజాగా కనిపిస్తోంది. మోడీ ఆధ్వర్యాన దేశంలో జరుగుతున్న అభివృద్ధి ఎన్నికల్లో తమ అభ్యర్థులను గెలిపిస్తుందంటూ ఆ పార్టీ ఎపి అధ్యక్షుడు సోము వీర్రాజు తాజాగా విశాఖలో పర్యటిస్తూ చెప్పడం చూస్తే 'దెయ్యాలు వేదాలు వల్లించడం'గా పేర్కొనవచ్చు. ముఖ్యంగా బిజెపి శకునిపాత్ర గురించి అభివృద్ధికి నిధులను ఎగ్గొట్టే విధానం, ప్రభుత్వ రంగ సంస్థలను ధ్వంసం చేసే సిద్ధాంతం గురించీ ఈ ప్రాంత వాసుల నుంచి తీవ్ర ఆక్షేపణలు వస్తున్నాయి. వైజాగ్ స్టీల్‌ప్లాంట్‌ను వంద శాతం అమ్మకానికి పెట్టిన రెండేళ్ల నుంచీ ఈ ప్రాంత ప్రజల నిరసనలను బిజెపి ఎదుర్కొంటున్న సంగతి తెలిసిందే. అయినా కాషాయ నేతల నోటి నుంచి అసత్య పేలాపనలే వినిపిస్తున్నాయి. ఉత్తరాంధ్ర జిల్లాలకు వెనుకబడిన ప్రాంత నిధులివ్వకుండా ఎండగట్టేసిన కేంద్రంలోని బిజెపి.. విశాఖలో ఉత్తర కుమార ప్రగల్భాలతో ఓట్లు దండుకోవాలని చూస్తోంది. దేశంలో అమలు చేసే నమూనాలో భాగంగానే విశాఖ, ఆంధ్రప్రదేశ్‌లోనూ ఆ పార్టీ నేతలు పావులు కదుపుతున్నారు. ఉత్తరప్రదేశ్ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవ సభకు విశాఖలో పోలీసులు, ఈ రాష్ట్ర ప్రభుత్వం అనుమతివ్వడమే ఒక నీతిమాలిన చర్య. దీంట్లో దాగివున్న విషయాలను చూస్తే... ఉత్తరప్రదేశ్, బీహార్ లేదా ఉత్తరాది రాష్ట్రాలకు చెందిన కొంతమంది నేవీ, స్టీల్‌ప్లాంట్, పోర్టు, రైల్వే, హెచ్‌పిసిఎల్ ఉద్యోగులను ఏదో ఒక విధంగా ప్రాంతీయతత్వంతో రెచ్చగొట్టే చర్యలే కనిపిస్తున్నాయి.

BEFORE THE HONOURABLE DISTRICT CONSUMER REDRESSAL COMMISSION-II AT: VISAKHAPATNAM
C.C.No. 90 / 2022

Between:
Salapu Kanaka Rao ...Complainant
And:
Smt. Dantuluri Sunitha & Others ...Opposite Parties

To,
Opposite Party No.1:
Smt. Dantuluri Sunitha,
W/o. D.PS.Varma, Hindu,
aged 47 years, Qtr. No. 98/B,
Sector-I, Ukkunagaram,
Visakhapatnam -530 32.

NOTICE

Please take notice that the above named complainant filed the above C.C. against you and others and the matter is posted to **09-02-2023**

Therefore, You are requested to appear in the above court on **09-02-2023** at **10:30 A.M** either in person or through an advocate, failing which the matter will be decided ex-parte.

A.V.C.N. NAGESWARA RAO
Advocate, D.No.29-2-31
GF Hemalatha Towers,
Opp. District Court,
Prakasaraopeta
Visakhapatnam, Cell: 9346351147
Visakhapatnam
Dt. 21-01-2023

IN THE HON'BLE COURT OF THE PRINCIPAL SENIOR CIVIL JUDGE AT:VISAKHAPATNAM
E.P. 79/2018 in O.S. 295/2008
Between :
Smt. Polarapu Mahalakshmi ...Decree Holder
And
Noonela Mohana Krishna Raju ...Judgment Debtor

వేలం ప్రకటన

పై నెంబరు అమలు పిటీషన్‌లో డిక్రీ బాకీ + వడ్డీ మరియు ఖర్చులు రాబట్టు నిమిత్తం పైతెలిపిన జడ్జిమెంట్ డెటారు యొక్క ఈక్రింది ఐటమ్ నెం.1 & 2 షెడ్యూలు ఆస్తులను తేది. **09-02- 2023**న వేలం వేయుటకు మహారాజశ్రీ కోర్టువారు ఉత్తర్వులు జారీచేసియున్నారు. కావున వేలం తేది. **09-02-2023**న ఉ॥గం॥ **10.30**ని॥ల నుండి సా॥గం॥**5.00** మధ్య సమయంలో వేలం వేయుదురు. సదరు వేలంపాటలో పాల్గొనదలచిన ఆసక్తి గలవారు పైతేదిన, పైతెలిపిన శ్రీ కోర్టువారి ఎదుట హాజరై వేలం షరతులకు లోబడి పాడుకొనవచ్చు నని ఇందుమూలంగా యావన్మందికీ తెలియజేయడమైనది.

SCHEDULE OF PROPERTIES

ITEM No.1: Visakhapatnam District, Gajuwaka Sub-D, Greater Visakhapatnam Municipal Corporation limits, Malkapuram Division, RCC Slabbed Building with Two Floors bearing D.No.59-24-35 with Asst. No. 79497 bounded by: **East:** N. Penta Rao's House, **South:** Road, **West:** N. Maha lakshmi's House, **North:** P. Vijaya lakshmi's House.
DHR Value : Rs. 4,00,000/-
Amin Value: Rs.10,00,000/-
J.Dr Value : Not furnished

ITEM No.2: Visakhapatnam District, Gajuwaka Sub-D, Greater Visakhapatnam Municipal Corporation limits, Malkapuram Division, RCC Slabbed Building bearing D.No.59-24-13 with Asst. No. 79482 bounded by: **East:** K. Appa Rao's House, **South:** S. Appalanarasamma's House, **West:** N. Tata Rao's House, **North:** Road.
DHR Value : Rs. 4,00,000/-
Amin Value: Rs.10,00,000/-
J.Dr Value : Not furnished

J.V. PREMA SAI
M. SIVA RAMAKRISHNA &
J. MALLIKARJUNA RAO
Advocates
Visakhapatnam. Cell: **93932 67881**

కార్మికవాడలో వీధి దీపాలు

-'ప్రజాశక్తి' కథనానికి స్పందన

ప్రజాశక్తి -తగరపువలస : చిట్టివలస జ్యూట్ కార్మికవాడ, కొత్తపేటలో ఎట్టకేలకు శనివారం జివిఎంసి ఎలక్ట్రికల్ విభాగం అధికారులు వీధి దీపాలు అమర్చారు. 'వెలుగులు మూన్నాళ్ళ ముచ్చటే' శీర్షికన ప్రజాశక్తి దినపత్రికలో ఇటీవల ప్రచురితమైన కథనానికి సంబంధిత అధికారులు స్పందించి వీధి దీపాలు అమర్చారు.

వైసిపి పాలనపై వ్యతిరేకత : టిడిపి

ప్రజాశక్తి -భీమునిపట్నం : వైసిపి పాలనపై ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత ఉందని టిడిపి రాష్ట్ర కార్యదర్శి గంటా నూకరాజు విమర్శించారు. జివిఎంసి 3వ వార్డు పరిధి నేరెళ్లవలసలో శనివారం ఇదేమి ఖర్మ మన రాష్ట్రానికి పేరిట నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, వైసిపి ప్రభుత్వ పాలనలో పెరుగుతున్న ధరలు, నిరుద్యోగ సమస్య, ప్రజలపై భారాలు తదితరాలతో అన్ని తరగతుల ప్రజలను ఇబ్బందులకు గురి చేస్తున్నాయన్నారు. ఈ కార్యక్రమంలో సతీష్, నాయుడు, శంకరరావు, పైడిరాజు పాల్గొన్నారు.

గురుకుల విద్యార్థికి అభినందన

ప్రజాశక్తి - ఆరిలోవ : ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర జూనియర్ యూత్ క్యారమ్‌లో జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైన శ్రీకృష్ణాపురంలోని డాక్టర్ అంబేద్కర్ గురుకుల పాఠశాలకు చెందిన పదో తరగతి విద్యార్థి ఎం.యశ్వంత్‌కు పాఠశాల సిబ్బంది అభినందనలు తెలిపారు. రాష్ట్ర స్థాయిలో ప్రతిభ కనబరిచిన యశ్వంత్ ఫిబ్రవరిలో ముంబయిలో జరిగే జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొనున్నారు. శనివారం పాఠశాలలో విద్యార్థిని ప్రిన్సిపల్ ఫ్లోరెన్స్, వైస్ ప్రిన్సిపల్ బి.రామకృష్ణ, అల్లు సత్య సుధాకర్, ఎస్.లక్ష్మణరావు అభినందించారు. గురుకుల పాఠశాలల జిల్లా సమన్వయకర్త ఎస్.రూపావతి హర్షం వ్యక్తం చేశారు.

'పిఎం శ్రీ' డీడీ పర్యటన

ప్రజాశక్తి -తగరపువలస : జివిఎంసి ఒకటో వార్డు పరిధి బంగ్లామెట్ట ప్రాథమిక పాఠశాలను పిఎం శ్రీ యోజన పథకం డిప్యూటీ డైరెక్టర్ ఎం.వెంకటలక్ష్మి శనివారం సందర్శించారు. ఎండిఎం అమలు తీరును పరిశీలించారు. యూనిఫాం, బూట్లు, పాఠ్య పుస్తకాలు ఏ మేరకు అందినవీ అడిగి తెలుసుకున్నారు. ఏకో క్లబ్, గణిత క్లబ్, పద్య కమిటీ, విద్యార్థుల, ఉపాధ్యాయుల హాజరు పట్టిక పరిశీలించారు. హ్యాండ్ వాష్, తాగునీటి సదుపాయం, గార్డెన్ పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఎండిఎం జిల్లా కో -ఆర్డినేటర్ శాస్త్రి, ఎంఇఒ బాలామణి, హెచ్ఎం రెడ్డిపల్లి అప్పలరాజు, పేరెంట్స్ కమిటీ చైర్‌పర్సన్ యు.మానసాదేవి, ఉపాధ్యాయులు రమేష్, మల్లిక, నాగమణి తదితరులు ఉన్నారు.

వృద్ధులకు దుప్పట్ల పంపిణీ

ప్రజాశక్తి- ఆనందపురం : వెల్లంకి పంచాయతీలో 600 మంది వృద్ధులు, వికలాంగులకు బికె స్టీల్ కంపెనీ తరుపున సావిత్రి దేవి బన్సల్ చారిటబుల్ ట్రస్ట్ సౌజన్యంతో దుప్పట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో బికె స్టీల్ యాజమాన్యం, వెల్లంకి సర్పంచ్ ఉప్పాడ లక్ష్మణరావు, బీసీ కార్పొరేషన్ డైరెక్టర్ కె.చంద్రమౌళి, ఉప సర్పంచ్ కంచరాపు శ్రీనివాసరావు, వైసిపి నాయకులు కాకర వెంకటరమణ, పి.వెంకటరమణ పాల్గొన్నారు.

ఉక్కు ప్రజాగర్జనను జయప్రదం చేయాలి

ప్రజాశక్తి-ఉక్కునగరం : ఉక్కు ఉద్యమాన్ని రెండవ దశలోకి తీసుకెళ్లడంలో భాగంగా ఈ నెల 30వ తేదీన చేపట్టే ఉక్కు ప్రజా గర్జనను జయప్రదం చేయాలని స్టీల్ సిఐటియు అధ్యక్షులు వైటి.దాస్ పిలుపునిచ్చారు. ఉక్కునగరంలోని సిఐటియు కార్యాలయంలో జరిగిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. నేటి వరకు కార్మిక వర్గం ఐక్యంగా పోరాటాన్ని నిర్వహించిందని, ఇక నుంచి రాష్ట్రవ్యాప్తంగా ప్రజా ఉద్యమాన్ని నిర్మించడానికే ఉక్కు ప్రజా గర్జన నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రతి కార్మికుడూ భాగస్వామ్యం కావాలని పిలుపునిచ్చారు.

ముఖ్య అతిథిగా హాజరైన 78వ వార్డు కార్పొరేటర్ డాక్టర్ బి.గంగారావు, మాట్లాడుతూ, స్టీల్‌ప్లాంట్ ప్రభుత్వ రంగంలో కొనసాగడం ద్వారానే రాష్ట్ర అభివృద్ధి ఉంటుందన్న సత్యాన్ని వివిధ పార్టీల ప్రతినిధులు ఒప్పుకుంటున్నారని వివరించారు. ఈ నెల 23వ తేదీన గాజువాకలో ఉన్న 21 మంది కార్పొరేటర్లతో వెస్ట్ రామచంద్ర హోటల్లో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహిస్తున్నామని తెలిపారు. దీనిలో స్థానిక ఎమ్మెల్యే, కార్పొరేటర్లు పాల్గొంటున్నారని పేర్కొన్నారు.

స్టీల్ సిఐటియు గౌరవాధ్యక్షులు జె.అయోధ్యరామ్ మాట్లాడుతూ, కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టే బడ్జెట్ ప్రతిపాదనలో ప్రభుత్వ రంగ పరిశ్రమల అమ్మకాలపై ఈ పోరాటం ప్రభావం చూపుతుందన్నారు. ఈ అంశాన్ని దృష్టిలో ఉంచుకొని ఉక్కు ప్రజా గర్జనను ప్రతి ఒక్కరూ జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో స్టీల్ సిఐటియు ప్రతినిధులు బి.అప్పారావు, పి.శ్రీనివాసరాజు, గంగాధర్, యు.వెంకటేశ్వర్లు, మరిడయ్య, నీలకంఠం, కృష్ణమూర్తి, పుల్లారావు, శశిరెడ్డి, ఉమామహేశ్వరరావు, ఆర్.రాజేశ్వరరావు, బిఎన్.మధుసూదన్, మొహిద్దీన్, సూర్యనారాయణ, కె.బాలశౌరి, కె.సత్యనారాయణ, వివిధ విభాగాల కార్యదర్శులు పాల్గొన్నారు.

తాగునీటి పనులకు శంకుస్థాపన

ప్రజాశక్తి -మధురవాడ : జీవీఎంసీ 5వ వార్డు పరిధిలోని శారదానగర్, అయ్యప్పనగర్, ముత్యాలమ్మకాలనీ, గాంధీ నగర్‌లో శాశ్వతంగా తాగునీటి సమస్య పరిష్కారానికి రూ.1.2 కోట్లతో చేపట్టే పనులకు ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, తాగునీటి సరఫరా పైపుల మరమ్మతులకు, ముత్యాలమ్మ కాలనీ, గాంధీ నగరంలో నూతనంగా తాగునీటి సరఫరా పనులకు శంకుస్థాపన చేసినట్లు తెలిపారు. గతంలో గడపగడప కార్యక్రమంలో ఈ ప్రాంతానికి వచ్చినప్పుడు కొండవాలు ప్రాంతాల సమస్యలు తన దృష్టికి వచ్చాయని, అందులో తాగునీటి సమస్యను ప్రధానంగా గుర్తించి పనులు చేపట్టినట్లు తెలిపారు. మిగిలిన సమస్యలను దశలవారీగా పరిష్కరిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో వార్డు కార్పొరేటర్ మొల్లి హేమలత, మాజీ కార్పొరేటర్ పోతిన హనుమంతరావు, టిడిపి నాయకుడు మొల్లి లక్ష్మణరావు, 7వ వార్డు వైసిపి అధ్యక్షుడు పోతిన శ్రీనివాసరావు, పోతిన సురేష్, బాబ్జి, అప్పన్న, సంజీవ్, రజని జోనల్ కమిషనర్ కనకమహాలక్ష్మి, పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.

'అనిల్ నీరుకొండ'లో అరుదైన శస్త్ర చికిత్స

తొలగించిన పెద్ద కణితితో శస్త్ర చికిత్స జరిపిన వైద్యుల బృందం

ప్రజాశక్తి -తగరపువలస : స్థానిక సంగివలస అనిల్ నీరుకొండ ఆసుపత్రిలో శనివారం ఓ మహిళకు అరుదైన శస్త్ర చికిత్స చేశారు. కొమ్మాదికి చెందిన 45 ఏళ్ల మహిళ కడుపు నొప్పి, యూరినల్ సమస్యతో అనిల్ నీరు కొండ ఆసుపత్రిలో చేరారు. అల్ట్రాస్కాన్, ఎంఆర్‌టి స్కాన్ ఉచితంగా చేశారు. గర్భ సంచి కంఠానికి పెద్ద కణితి, గర్భాశయానికి కూడా కణితులు ఉన్నట్లు వైద్యులు గుర్తించారు. గైనకాలజీ నిపుణులు డాక్టర్ వి.ప్రభావతి ఆధ్వర్యాన వైద్యులు భాగ్యశ్రీ, హిరణ్మయి, కావ్య, జనరల్ సర్జన్ డాక్టర్ సత్య కుమార్ శస్త్ర చికిత్స చేసి ఆమె గర్భ సంచి కంఠం నుంచి 15 X 10 వైశాల్యం గల కణితిని తొలగించినట్లు ఆసుపత్రి వైద్య వర్గాలు తెలిపాయి.

ముగిసిన వెటర్నరీ వైద్యుల కార్యశాల

ప్రజాశక్తి - ఆరిలోవ : ఇందిరాగాంధీ జంతు ప్రదర్శనశాల ఆధ్వర్యాన అటవీశాఖ అధికారులు, పశు వైద్యులతో కలిసి విమ్స్ సమీపంలో గల పశుసంవర్ధక శాఖకు చెందిన స్కిల్ భవనంలో రెండు రోజుల పాటు నిర్వహించిన కార్యశాల శనివారం ముగిసింది. ఈ కార్యశాలకు శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నం జిల్లాల నుంచి పశుసంవర్ధక శాఖకు చెందిన అసిస్టెంట్ డైరెక్టర్లు, సీనియర్ వెటర్నరీ వైద్యులు పాల్గొన్నారు. పెద్ద పులులు, ఏనుగులు, చిరుతలు, జింకలు అటవీ ప్రాంతాలను ఆనుకొని ఉన్న గ్రామాలకు, పంట పొలాల్లోకి ఎందుకు ప్రవేశించాల్సి వస్తుందో అటవీశాఖ సిసిఎఫ్ శ్రీకంఠనాథరెడ్డి వివరించారు. వాటిని సురక్షితంగా పట్టుకొని తిరిగి అడవుల్లోకి తరలించడంలో వెటర్నరీ వైద్యుల సహకారం చాలా అవసరం అన్నారు. వన్యప్రాణుల సంరక్షణలో అటవీశాఖ అధికారులు, పశువైద్యులు సమన్వయంతో పనిచేయాలని కోరారు. ఈ కార్యశాలకు సహకరించిన పశుసంవర్ధక శాఖ అడిషనల్ డైరెక్టర్ డాక్టర్ వై.సింహాచలంనకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో జూనియర్ వెటర్నరీ డాక్టర్ శ్రీనివాస్, ఎసిఎఫ్ మంగమ్మ, అటవీశాఖ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

పలుచోట్ల గడపగడపకు మన ప్రభుత్వం

ప్రజాశక్తి-యంత్రాంగం

సీతమ్మధార : జివిఎంసి 46వ వార్డు పరిధి మధుసూదననగర్‌లో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఉత్తర నియోజకవర్గ వైసిపి సమన్వయకర్త కెకె రాజు, డిప్యూటీ మేయర్ కటుమూరి సతీష్‌తో కలిసి ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాలను వివరించారు. ప్రజల సమస్యలడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కెకె.రాజు మాట్లాడుతూ, ముఖ్యమంత్రిగా జగన్మోహన్‌రెడ్డి అధికారం చేపట్టాక సచివాలయాల ద్వారా కొండవాలు, మురికివాడల ప్రాంతాల్లోని సమస్యలను పరిష్కరిస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో కో-ఆప్షన్ సభ్యులు సేనాపతి అప్పారావు, 14వ వార్డు కార్పొరేటర్ కె.అనిల్‌కుమార్‌రాజు, రాష్ట్ర సంయుక్త కార్యదర్శి కిరణ్‌రాజు, వార్డు అధ్యక్షులు పైడి రమణ, జీవీఎంసీ అధికారులు, సచివాలయ సిబ్బంది, వాలంటీర్లు పాల్గొన్నారు.

ఆనందపురం : మండలంలోని మామిడిలోవ పంచాయతీలో శనివారం భీమిలి ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు ఆధ్వర్యాన గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. పంచాయతీలోని ప్రజల సమస్యలను, ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందుతున్న తీరును ఎమ్మెల్యే అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో మహిళలచే కోలాటం ఏర్పాటుచేశారు. ఈ కార్యక్రమంలో వైసిపి నాయకులు బంక సత్యనారాయణ, కాకర్లపూడి శ్రీకాంత్‌రాజు, కోరాడ వెంకటరావు, మజ్జి వెంకటరావు, బలిరెడ్డి మహేష్, రమేష్‌బాబు, పాండ్రంకి శ్రీను, కోరాడ ముసలినాయుడు, బొట్టా రామకృష్ణ పాల్గొన్నారు.

నేరాలు ఘోరాలు

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

ప్రజాశక్తి-మాడుగుల:మాడుగుల, ఎం.కోడూరు మార్గంలో శనివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో నిర్మలా కాలనీకి చెందిన మంచేటి సత్తిబాబు మృతి చెందాడు. పాము భీమరాజుతో సహా ఇద్దరూ బైక్‌పై వస్తుండగా ధ్యాన కేంద్రం వద్ద వాహనం అదుపు తప్పింది. ఈ ప్రమాదంలో సత్తిబాబు అక్కడికక్కడే మృతి చెందాడు. భీమరాజును ఆసుపత్రికి తరలించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఇద్దరిపై కేసు

ప్రజాశక్తి-గొలుగొండ:మండలంలో కొంగసింగి గ్రామ శివారుల్లో చిత్తులాట ఆడుతున్న ఇద్దరు వ్యక్తులపై కేసు నమోదు చేశామని కేడీపేట ఎస్సై సూర్యనారాయణ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, వారి వద్ద రూ.2,300 నగదు స్వాధీనం చేసుకున్నామన్నారు. ఏఎల్‌పురం గ్రామ శివారు శివాలయం సమీపంలో కోడి పందాలపై దాడి చేయడం జరిగిందని, ఇద్దరు వ్యక్తులను పట్టుకోగా వారి వద్ద రెండు కోడిపుంజులు స్వాధీనం చేసుకున్నామని తెలిపారు.

వైభవంగా తెప్పోత్సవం

ప్రజాశక్తి-సింహాచలం: అమావాస్యను పురస్కరించుకొని వరహా పుష్కరిణిలో సింహాద్రి అప్పన్న తెప్పోత్సవాన్ని అత్యంత వైభవంగా నిర్వహించారు. ఈ ఉత్సవం సందర్భంగా స్వామివారిని మేల్కొల్పి పలు ఆరాధన సేవా కార్యక్రమాలు నిర్వహించారు. మధ్యాహ్నం మూడు గంటలకు పల్లకిలో మెట్ల మార్గం గుండా కొండ దిగువకు తీసుకొచ్చి వరహా పుష్కరిణిలో ప్రత్యేక పూజలు జరిపారు. అనంతరం హంస వాహనంపై పుష్కరిణి మధ్యలో ఉన్న మండపానికి చేర్చారు. అనంతరం పుష్కరిణి సత్రానికి చేరుకొని, ప్రత్యేక మనోరంజక వాహనంపై గోపాలస్వామి అలంకరణలో ఉన్న స్వామివారికి గ్రామ తిరువీధి నిర్వహించారు. భక్తులు తమ ఇళ్ల ముందు రంగవల్లులు వేసి స్వామివారికి స్వాగతం పలికారు. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా చెరువు ప్రాంతంలో పోలీసు భద్రత, గజ ఈతగాళ్లను అందుబాటులో ఉంచారు. ఈ ఉత్సవంలో దేవస్థానం ఇన్‌ఛార్జి ఈవో వి.త్రినాధరావు, దేవస్థానం అధికారులు, పోలీసులు, ట్రస్ట్ బోర్డు సభ్యులు, భక్తుల పాల్గొని తెప్పోత్సవాన్ని వీక్షించారు.

గిరిబాబుకు పుట్టినరోజు శుభాకాంక్షలు

ప్రజాశక్తి-పద్మనాభం: జెడ్‌పిటిసి సభ్యులు సుంకర గిరిబాబుకు పలువురు నాయకులు, మండల అధికారులు పుట్టిన రోజు శుభాకాంక్షలు తెలిపారు. పద్మనాభం జంక్షన్‌లో ఉన్న మండల వైసిపి కార్యాలయంలో శనివారం ఎంపిపి కటుంబోతు రాంబాబు ఆధ్వర్యాన ప్రత్యేక సమావేశం ఏర్పాటుచేశారు. ఈ సందర్భంగా ఎంపిపి రాంబాబుకు కుంతీమాధవస్వామి, అనంతపద్మనాభ స్వామి ఫొటోను మండల పరిషత్ నుంచి జ్ఞాపికగా అందించారు. అనంతరం పలు గ్రామాల నాయకులు జ్ఞాపికలను అందించి పుట్టిన రోజు శుభాకాంక్షలు తెలిపారు. రెడ్డిపల్లిలోని జెడ్‌పిటిసి ఇంటికి తహశీల్దార్, ఎంపిడిఒ కార్యాలయాల సిబ్బంది వెళ్లి శుభాకాంక్షలు తెలిపారు.

ముఖ్యమంత్రికి పద్మావతి కృతజ్ఞతలు

ప్రజాశక్తి -మధురవాడ : రాష్ట్రంలోని 55 బీసీ కార్పొరేషన్ల పదవీ కాలాన్ని పొడిగిస్తూ ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఆదేశాలు జారీ చేయడం పట్ల ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కళింగ వెల్ఫేర్ అండ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్ బి పద్మావతి ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, పేద, బడుగు, బలహీన వర్గాలకు ఎల్లవేళలా అండదండగా ఉంటూ, వారి అభ్యున్నతికి నిరంతరం ముఖ్యమంత్రి పాటుపడుతున్నారన్నారు. ముఖ్యమంత్రి తనపై ఉంచిన నమ్మకాన్ని వమ్ము చేయకుండా పార్టీ అభివృద్ధికి పనిచేస్తానని చెప్పారు.

ముగిసిన ఇఎన్‌టి సర్జికల్ వర్క్‌షాపు

ప్రజాశక్తి -మధురవాడ : గాయత్రి వైద్య కళాశాల, ఆసుపత్రి ఇఎన్‌టి విభాగం ఆధ్వర్యాన రెండురోజులు నుంచి "లార్జ్ స్కేల్ టెంపోరల్ బోన్ హ్యాండ్స్ ఆన్ డిసెక్షన్ కోర్స్‌పై నిర్వహించిన వర్క్‌షాపు శనివారంతో ముగిసింది. ఈ సందర్భంగా ఇఎన్‌టి డాక్టర్ సూర్యప్రకాశరావు మాట్లాడుతూ, దేశంలోనే తొలిసారిగా ఈ కార్యక్రమం చేపట్టినట్లు తెలిపారు. 21, 22 తేదీల్లో లైవ్ సర్జికల్ వర్క్‌షాప్ నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. జైపూర్ నుంచి వచ్చిన ప్రఖ్యాత ఇఎన్‌టి, స్కల్ బేస్ సర్జన్ డాక్టర్ సతీష్ జైన్, డాక్టర్ అప్పారావు అత్యంత నైపుణ్యంతో 20 అరుదైన సంక్లిష్టమైన వ్యాధులకు నివారణకు చికిత్సను ఉచితంగానే చేపట్టారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ డిఆర్‌కెఎల్ఎన్.రాజు ఆర్గనైజింగ్ సెక్రటరీ, అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ శ్రీనివాస్, డాక్టర్ నిహారిక, డాక్టర్ సౌమ్య, డాక్టర్ విహారి, సీనియర్ రెసిడెంట్స్ డాక్టర్ సుస్మిత, డాక్టర్ స్వాతి, పోస్ట్ గ్రాడ్యుయేట్స్ అసోసియేషన్ ఆఫ్ నార్త్ కోస్టల్ ఆంధ్రా ఇఎన్‌టి సర్జన్, సెక్రటరీ డాక్టర్ బి.నాగేశ్వరరావు, కోశాధికారి డాక్టర్ టివిఎస్ఎస్ఎన్.లీలా ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

నూతన పంచింగ్ విధానంపై సిఐటియు నిరసన

ప్రజాశక్తి- గాజువాక : బిహెచ్ఇఎల్ యాజమాన్యం ఏకపక్షంగా ప్రవేశపెట్టిన నూతన పంచింగ్ విధానాన్ని నిరసిస్తూ సిఐటియు ఆధ్వర్యాన మెయిన్ గేటు వద్ద శనివారం నల్లజెండాలతో నిరసన ప్రదర్శన చేపట్టారు. ఈ సందర్భంగా బెల్ యూనిట్ సిఐటియు ప్రధాన కార్యదర్శి జిటిపి ప్రకాష్ మాట్లాడుతూ, మెయిన్ గేటు వద్ద, ప్రతి సెక్షన్‌లోనూ పంచింగ్ విధానం ప్రవేశ పెట్టడం దారుణం అన్నారు. కార్మికులను ఎనిమిది గంటల పని విధానం ప్రవేశపెట్టి, ఇతర యూనిట్లు మాదిరిగా అన్ని సౌకర్యాలు కల్పించాలని డిమాండ్ చేశారు. యాజమాన్యం ప్రవేశపెట్టిన సర్క్యులర్‌ను తక్షణమే ఉపసంహరించుకోవాలని కోరారు. అన్ని కార్మిక సంఘాలను కలుపుకొని ఆందోళన ఉధృతం చేస్తామని హెచ్చరించారు. రెండు సార్లు పంచింగ్ విధానం సరికాదన్నారు. ఈ కార్యక్రమంలో కె.విజయ్‌కుమార్, జి.అచ్చంనాయుడు, అధిక సంఖ్యలో కార్మికులు ఎస్.జగన్నాథరావు, నారపరెడ్డి, అప్పారావు, పాల్గొన్నారు.

కార్మికులనుద్దేశించి మాట్లాడుతున్న ప్రకాష్

ముగిసిన ఎంఎస్ఎంఇ ఎక్స్‌పో

ఎక్స్‌పోలో ఏర్పాటుచేసిన స్టాళ్లు

ప్రజాశక్తి -గాజువాక : గాజువాక ఆటోనగర్ వాసవిలో ఏర్పాటుచేసిన ఎంఎస్ఎంఇ ఎక్స్‌పో శనివారం సాయంత్రంతో ముగిసింది. ఎక్స్‌పోలో 52 మంది స్టాల్స్ ఏర్పాటుచేశారు. 2000 మంది వరకు సందర్శకులు వచ్చారు. ముఖ్య అతిథిగా హాజరైన హిందుస్థాన్ షిప్ యార్డ్ విశ్రాంత సిఎండి హేమంత్ ఖత్రి మాట్లాడుతూ, ఇలాంటి ఎక్స్‌పోల వల్ల చిన్న, తరహా మధ్యతర పరిశ్రమలకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందన్నారు. వివిధ ప్రాంతాల్లో తయారుచేసిన వస్తువులు ఒకే చోట ప్రదర్శించడం లాభం చేకూరుతుందని తెలిపారు. ఎంఎస్ఎంఇ డిఎఫ్ఒ ఎల్ఎస్.రావు స్టాళ్లను తిలకించారు. ఈ కార్యక్రమంలో విశాఖ ఆటోనగర్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు ఎకె.బాలాజీ, వినోద్ పాల్గొన్నారు.

ప్రభుత్వరంగ పరిశ్రమల ప్రయివేటీకరణపై నిరసన

ప్రజాశక్తి-సీతమ్మధార : ప్రభుత్వ రంగ పరిశ్రమలైన విశాఖ స్టీల్‌ప్లాంటు, రైల్వే, రక్షణ రంగం, బ్యాంకులు, ఇన్సూరెన్స్ సంస్థలు, ఆయిల్ కంపెనీలను ప్రైవేటు, బడా కార్పొరేట్ సంస్థలకు అమ్మకాలను కేంద్రంలోని మోడీ ప్రభుత్వం వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ శనివారం సీతమ్మధారలో ఎఐటియుసి ఆధ్వర్యాన నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఎఐటియుసి రాష్ట్ర వర్కింగ్ కమిటీ సభ్యులు వామనమూర్తి మాట్లాడుతూ, విశాఖ స్టీల్ ప్లాంట్‌కు అవసరమైన ఐరన్ ఓర్‌ను కేటాయించాలని, నిర్వాసితులందరికీ ఉద్యోగాలు వెంటనే ఇవ్వాలని డిమాండ్ చేస్తూ జనవరి 30న జరిపే ప్రజా గర్జనను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఎన్నికల్లో ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయలేని ప్రధాని నరేంద్ర మోడీ రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. విశాఖ స్టీల్‌ప్లాంట్ రక్షణకు జనవరి 23, 24, 25 తేదీల్లో రాష్ట్ర వ్యాప్తంగా సిపిఐ, ఎఐటియుసి నిర్వహించి తలపెట్టిన కార్మిక, ప్రజా, విద్యార్థి, యువజన సంఘాల ఆందోళన కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో రావికృష్ణ, నాగరాజు, వై.లక్ష్మణరావు, శ్రీనివాసు, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ బలోపేతానికి కృషి : రాకేష్‌రెడ్డి

ప్రజాశక్తి-పెందుర్తి: కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి కృషి చేయాలని పిసిసి వర్కింగ్ ప్రెసిడెంట్ పోచారెడ్డి రాకేష్‌రెడ్డి పిలుపునిచ్చారు. పెందుర్తి నియోజకవర్గ ఇన్‌ఛార్జి ఆడారి రమేష్ నివాసంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, రాహుల్‌గాంధీ చేపట్టిన జోడోయాత్ర ముగింపు సందర్భంగా ఈ నెల 26 నుంచి రాష్ట్రంలోని అన్ని నియోజకవర్గాల్లోను పాదయాత్రలు చేపట్టాలని పార్టీ అధిష్టానం నిర్ణయించిందని తెలిపారు. ఈ కార్యక్రమం ద్వారా పార్టీని ప్రజల్లోకి తీసుకెళ్లాలని సూచించారు. దీనికోసం ఆడారి రమేష్ నాయుడు, షేక్ షఫీ ఉల్లా, విస్సకోట రాము, ఆర్ఆర్ నాయుడు, బిఎస్ నాయుడు, ముక్కా రామునాయుడులతో కూడిన సమన్వయ కమిటీని ఏర్పాటుచేశారు. వీరి భాగస్వామ్యంతో పార్టీని మరింత బలోపేతం చేసే విధంగా అందరూ కలిసికట్టుగా సాగాలని సూచించారు. ఈ సందర్భంగా పలు పార్టీలకు చెందిన నాయకులు, కార్యకర్తలు కాంగ్రెస్ తీర్థం పుచ్చుకున్నారు.

పేదలకు చీరల పంపిణీ

పేదలకు చీరలు పంపిణీ చేస్తున్న గ్రామ కమిటీ సభ్యులు

ప్రజాశక్తి -ములగాడ : మల్కాపురం గ్రామ సంక్షేమ సంఘం, 16 కుల సంఘాల ఆధ్వర్యాన ప్రకాష్‌నగర్‌లోని ఏడు గుడుల అమ్మవార్ల ఆవరణవలో నిరుపేదలకు చీరలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా గ్రామ కమిటీ సభ్యులు మాట్లాడుతూ, 500 మంది నిరుపేదలకు చీరలు పంపిణీ చేసినట్లు తెలిపారు. గ్రామంలోని సమస్యలను గ్రామ కమిటీ ఆధ్వర్యాన పరిష్కరిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ కమిటీ గౌరవాధ్యక్షులు బోగవిల్లి నాగభూషణం, అధ్యక్షులు సత్యాలమహేష్, కార్యదర్శి ఉరుకూటి బాబూరావు వర్కింగ్ ప్రెసిడెంట్ ముప్పిడి గిరి, సంయుక్త కార్యదర్శి మజ్జి రమేష్, పట్నాల అప్పారావు, మరిపిల్లి నూకరాజు, ఎల్లాజీ, నాగేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

అర్హులకు టిడ్కో ఇళ్లు ఇవ్వాలని సంతకాల సేకరణ

ప్రజాశక్తి- ములగాడ : అర్హులందరికీ టిడ్కో ఇళ్లు ఇవ్వాలని కొత్త నక్కవానిపాలెం చెక్‌పోస్టు ఏరియాలో సిపిఐ ఆధ్వర్యాన సంతకాల సేకరణ చేపట్టారు. ఈ సందర్భంగా సిపిఐ నాయకులు మాట్లాడుతూ, వాయుపుత్రకాలనీ ఏరియాలో, 59వ వార్డులో జగనన్న కాలనీ, టిడ్కో ఇళ్లను ఎంపిక చేసిన లబ్ధిదారులకు వెంటనే ఇవ్వాలని డిమాండ్‌చేశారు. స్థలం ఉండి ఇల్లు కట్టుకోవడానికి రూ.5 లక్షలు ఉచితంగా ఇవ్వాలని కోరారు. ఇసుక, సిమెంట్, ఐరన్ కూడా ఇవ్వాలని డిమాండ్ చేస్తూ సంతకాల సేకరణ చేపట్టినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో కార్యదర్శి ఆంజనేయ, సహాయ కార్యదర్శి గుడాల రాంబాబు, గండ అప్పారావు, డొక్కాడ గోపాలరావు, శ్రీలక్ష్మి, రమణమ్మ, లక్ష్మమ్మ తదితరులు పాల్గొన్నారు.

96వ వార్డులో వైసిపి కన్వీనర్ల నియామకం

ప్రజాశక్తి-పెందుర్తి: జివిఎంసి 96వ వార్డు పరిధిలోని అన్ని సచివాలయాలకు వైసిపి కన్వీనర్లను పెందుర్తి ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్ నియమించారు. శనివారం ఉదయం వార్డు కార్యాలయంలో 30 మంది పార్టీ కార్యకర్తలకు కన్వీనర్లుగా బాధ్యతలు అప్పగించారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ, ఫ్లెక్సీలో తమకు తాముగా ప్రకటించుకున్న పేర్లకు వైసిపికి సంబంధం లేదని, ఇప్పుడు తాను ప్రకటించిన వారే కన్వీనర్లుగా కొనసాగుతారని తెలిపారు. వీరు సిఫారసు చేసిన వారిని గృహసారథులుగా ఎంపిక చేస్తామని చెప్పారు. మాజీ మంత్రి బండారు సత్యనారాయణమూర్తి తనపై లేనిపోని ఆరోపణలు చేస్తున్నారని విమర్శించారు. తనపై చేసిన ఆరోపణలను బండారు రుజువు చేయాలని, లేకుంటే ఆయన చెప్పినట్లుగానే ఆత్మహత్యకు సిద్ధపడాలని సవాల్ విసిరారు. సమావేశంలో వార్డు పార్టీ అధ్యక్షుడు దాడి ఉమామహేష్, మార్కెట్ కమిటీ చైర్మన్ కోడిగుడ్ల దేవి సాంబ, రామునాయుడు, సరగడం నరసింహమూర్తి తదితరులు పాల్గొన్నారు.

న్యాయవాది నల్లబిల్లి కన్నుమూత

ప్రజాశక్తి-లీగల్ విలేకరి : న్యాయవాది, రంగస్థలం, సినీ నటుడు, సామాజికవేత్త నల్లబిల్లి విజయకుమార్ (58) శనివారం ఉదయం గుండెపోటుతో కన్నుమూశారు. విశాఖపట్నం కోర్టులో 18 ఏళ్లుగా న్యాయవాది వృత్తిలో ఉన్నారు. రంగస్థల, సినీ నటుడిగా రాణించారు. ఆంధ్రలేఖ తదితర పత్రికా విలేకరిగా కూడా కొన్నాళ్లు పనిచేశారు. పర్యావరణం పట్ల ఎంతో మక్కువ కలిగిన నల్లబిల్లి సామాజిక అంశాల్లో కీలకంగా వ్యవహరించేవారు. ఆంధ్ర విశ్వ కళా పరిషత్ రంగస్థలం విభాగంలో నటన, దర్శకత్వ విభాగాలలో పీజీ డిప్లమో చేశారు. పలు నాటికలు, నాటకలలో నటించిన విజయకుమార్ కొన్ని సినిమాలలో క్యారెక్టర్ ఆర్టిస్ట్‌గా నటించారు. విశాఖపట్నం న్యాయవాదుల సంఘం కార్యవర్గ సభ్యునిగా రెండు పర్యాయాలు ఎన్నికయ్యారు. ప్రస్తుతం విశాఖ బార్ లైబ్రరీ సెక్రటరీగా బాధ్యతలు నిర్వహిస్తున్నారు. ఆయనకు భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. జిల్లా ప్రధాన న్యాయమూర్తి గుర్రల గోపి, న్యాయవాదుల సంఘం అధ్యక్షులు వైద్యుల రవీంద్రబాబు, ఉపాధ్యక్షులు నమ్మి సన్యాసిరావు, ప్రధాన కార్యదర్శి ఎల్లపు వేణుగోపాల్, సీనియర్ న్యాయవాదులు కప్పిలి మురళీధర్, బగాది తులసీదాస్ తమ ప్రగాఢ సంతాపాన్ని తెలిపారు. న్యాయవాదులు, కళాకారులు, సామాజిక కార్యకర్తలు నల్లబిల్లి అంత్యక్రియల్లో పాల్గొన్నారు.

'సచివాలయ వ్యవస్థ విచ్ఛిన్నమే చంద్రబాబు లక్ష్యం'

ప్రజాశక్తి-సీతమ్మధార : సచివాలయ వ్యవస్థను విచ్ఛిన్నం చేయడమే మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు లక్ష్యమని వైసిపి ఉత్తర నియోజకవర్గం సమన్వయకర్త కెకె.రాజు ఆరోపించారు. బాలయ్యశాస్త్రి లే-అవుట్‌లోని వైసిపి కార్యాలయంలో శనివారం ఏర్పాటుచేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలను అడ్డుకొని ప్రజలను కష్టాలపాల్జేయాలని చంద్రబాబు చూస్తున్నారని, అందుకే వాలంటీర్, సచివాలయ వ్యవస్థపై బురద జల్లుతున్నారని విమర్శించారు. సచివాలయం ద్వారా 65 లక్షల మంది లబ్ధిదారులకు ప్రభుత్వ పథకాలు అందుతున్నాయని తెలిపారు. రణస్థలంలో స్వామి వివేకానంద జయంతి రోజున యువతను రెచ్చగొట్టే విధంగా జనసేన అధినేత పవన్ కల్యాణ్ ప్రసంగించారన్నారు. దాడి చేయండి, కల్లోలాలు సృష్టించండి అంటూ మాట్లాడడం సరికాదన్నారు. ఈ సమావేశంలో డిప్యూటీ మేయర్ కట్టమూరు సతీష్, ఫ్లోర్ లీడర్ బాణాల శ్రీను, కార్పొరేటర్లు అనీల్‌కుమార్‌రాజు, శంకరరావు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ ఎన్నికపై బిజెపి ప్రచారం

ప్రజాశక్తి-సీతమ్మధార : జివిఎంసి 14వ వార్డు పరిధిలో బిజెపి రాష్ట్ర అధ్యక్షులు సోము వీర్రాజు పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. విశాఖ అభివృద్ధికి ప్రధానమంత్రి చేస్తున్న కృషిని వివరించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ అభ్యర్థి పివిఎన్ మాధవ్, విశాఖ పార్లమెంట్ జిల్లా అధ్యక్షుడు ఎం.రవీంద్రారెడ్డి, పరశు రామరాజు, మాజీ ఎమ్మెల్యే విష్ణుకుమార్‌రాజు, రాష్ట్ర అధికార ప్రతినిధి సుహాసిని ఆనంద్, తదితరులు పాల్గొన్నారు.

నిజాయితీగా పనిచేయాలి

ప్రజాశక్తి-సీతమ్మధార : కొత్తగా నియమితులైన అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాలు నిజాయితీగా పనిచేయాలని ఉత్తర నియోజకవర్గ వైసిపి సమన్వయకర్త కెకె.రాజు సూచించారు. నియోజకవర్గంలో నూతనంగా నియామకమైన అంగన్వాడీ టీచర్, ఆయాలు కెకె.రాజును మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా కెకె.రాజు మాట్లాడుతూ, చిన్నారులకు, గర్భిణులకు, కిశోర బాలికలకు మంచి సేవలందించి ప్రశంసలు అందుకోవాలని సూచించారు.

'ఉత్తరం'లో కెకె.రాజు గ్రీవెన్స్

ప్రజాశక్తి-సీతమ్మధార : ఉత్తర నియోజకవర్గంలో ప్రజల సమస్యలు పరిష్కరించే దిశగా వైసిపి సమన్వయకర్త కెకె.రాజు శనివారం పార్టీ కార్యాలయంలో గ్రీవెన్స్ నిర్వహించారు. నియోజకవర్గం నుంచి పలువురు కార్యాలయానికి విచ్చేసి సమస్యలతో కూడిన వినతులను కెకె.రాజుకు అందించారు. ఈ వినతులపై సంబంధిత అధికారులతో మాట్లాడి కొన్నింటిని వెంటనే పరిష్కరించారు. మరికొన్నింటిని సంబంధిత అధికారులకు రిఫర్ చేసి త్వరలోనే పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు.

ఆకట్టుకున్న పద్య పఠనం

ప్రజాశక్తి -కంచరపాలెం : వేమన 351 జయంతిని పురస్కరించుకొని సాహితీ స్రవంతి ఆధ్వర్యాన కంచరపాలెంలోని ఓల్డ్ ఐటిఐలో విద్యార్థులతో పద్య పుస్తక పఠనం చేయించారు. ఈ సందర్భంగా సెంట్రల్ సిఐడి విశ్రాంత ఎస్‌పి సునీల్‌రెడ్డి మాట్లాడుతూ, తెలుగు వారందరూ గర్వపడే కవి వేమన అన్నారు. ప్రజలలో పాతుకుపోయిన అసాంఘిక మూఢత్వాన్ని పారద్రోలేందుకు ఆయన రచనలు దోహదపడ్డాయని అభిప్రాయపడ్డారు. జనవరి 19వ తేదీన వేమన జయంతిని అధికారికంగా నిర్వహించేందుకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ప్రకటించడంతో పాఠశాలల్లో విద్యార్థులచే పద్యాలను చదివిస్తున్నారని, చర్యకు పెడుతున్నారని తెలిపారు. ఇది ఎంతో శుభ పరిణామం అన్నారు. ఈ సందర్భంగా ఐటిఐ విద్యార్థులచే వేమన పద్య పఠనం జరిపించి చూడకుండా చెప్పిన వారికి పుస్తకాలను బహుమతులుగా అందజేశారు. ఈ కార్యక్రమంలో సాహితీ స్రవంతి ప్రతినిధులు పెంటకోట రామారావు, పోలమరశెట్టి ఫ్రాన్సిస్, ఆనందశర్మ, ఐటిఐ వైస్ ప్రిన్సిపల్ ఉమాశంకర్, ఉమా, కె.శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా బుడుమూరు జన్మదిన వేడుకలు

ప్రజాశక్తి - ఆరిలోవ : తెలుగుదేశం పార్టీ విశాఖ పార్లమెంటు ఎస్‌సి సెల్ అధ్యక్షులు, 9వ వార్డు ఇన్‌ఛార్జి బుడుమూరు గోవింద జన్మదిన వేడుకలు శనివారం తోటగరువు టిడిపి కార్యాలయంలో నిర్వహించారు. 9, 10, 11, 12, 13వ వార్డుల టిడిపి నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద ఎత్తున పాల్గొని పుట్టిన రోజు కేక్‌ను కట్ చేసి ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు.

ఉద్యోగ భద్రత కల్పించాలి

విశాఖ, అనకాపల్లి జిల్లాల్లో 108 ఉద్యోగుల రిలే దీక్షలు

ప్రజాశక్తి - కలెక్టరేట్ (విశాఖ)

108 ఇఎంటి, పైలట్లను ప్రభుత్వ కాంట్రాక్ట్ ఉద్యోగులుగా గుర్తించి, ఉద్యోగ భద్రత కల్పించాలని 108 ఎంప్లాయీస్ యూనియన్ (సిఐటియు) విశాఖ జిల్లా సమన్వయకర్త బి.శ్రీనివాసరావు, వర్కింగ్ ప్రెసిడెంట్ ఎం.సాయికుమార్ డిమాండ్ చేశారు. తమకు ఉద్యోగ భద్రత కల్పించాలంటూ శనివారం విశాఖలోని జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద 108 ఉద్యోగులు రిలే నిరాహార దీక్ష చేపట్టారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ ప్రభుత్వ నియామకాలలో 108 ఇఎంటి, పైలట్లకు సర్వీసును బట్టి వెయిటేజ్ మార్కులు ఇవ్వాలన్నారు. అరబిందో ఎమర్జెన్సీ మెడికల్ సర్వీసెస్ సంస్థ వచ్చాక వివిధ కారణాలతో విధుల నుంచి తొలగించిన వారందరినీ తిరిగి విధుల్లోకి తీసుకోవాలన్నారు. డిమాండ్లపై సోమవారం మరోసారి రిలే నిరాహార దీక్ష చేపడతామని, అప్పటికీ ప్రభుత్వం దిగి రాకపోతే సమ్మెకు వెళ్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో యూనియన్ కోశాధికారి బి.పరమేశ్వరరావు, సిహెచ్.రమణమ్మ, ఎకె.రావు, కొండబాబు, ఎం.లోవయ్య, శ్రీనివాస్, దేవుడు బాబు పాల్గొన్నారు.



జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద, అనకాపల్లి కలెక్టరేట్ ఎదుట రిలే దీక్షలు చేస్తున్న 108 ఉద్యోగులు

అనకాపల్లి : 108 ఉద్యోగులు శనివారం అనకాపల్లి కలెక్టరేట్ వద్ద సిఐటియు ఆధ్వర్యంలో నిరాహార దీక్షలు చేపట్టారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా కోశాధికారి వివి శ్రీనివాసరావు, ఉపాధ్యక్షుడు గనిశెట్టి సత్యనారాయణ మాట్లాడుతూ రెండు నెలల వేతన బకాయిలు తక్షణమే చెల్లించాలని, అందరికీ సమాన వేతనాలు ఇవ్వాలని, ప్రతియేటా 20 శాతం వేతన పెంపు అమలు చేయాలని, పిఎఫ్ ఈఎస్ఐ చెల్లింపులో సమాన వాటాలు చెల్లించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. అనంతరం డిఆర్ఓ వెంకటరమణకు వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో 108 ఉద్యోగుల సంఘం రాష్ట్ర కమిటీ సభ్యులు జెబిఎస్ ప్రసాద్, జిల్లా ఉపాధ్యక్షులు కోటి, అనకాపల్లి, నర్సీపట్నం డివిజన్ కార్యదర్శులు శ్రీరామ్మూర్తి, ప్రకాష్, ఉమా మహేష్ పాల్గొన్నారు.

ఎన్‌జిటి ఆదేశాలను తక్షణమే అమలు చేయాలి

ప్రజాశక్తి - అచ్యుతాపురం

నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్ ఇచ్చిన ఆదేశాల ప్రకారం బ్రాండిక్స్ సీడ్స్ పరిశ్రమలో గ్యాస్ లీకేజ్ బాధితుల 539 మందికి ఒక్కొక్కరికి లక్ష రూపాయలు చొప్పున పరిహారం వెంటనే చెల్లించాలని సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు ఆర్.రాము డిమాండ్ చేశారు. సిఐటియు కార్యాలయంలో శనివారం పరిహారం సమస్యపై కరపత్రాన్ని విడుదల చేసి, కార్మికులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా రాము మాట్లాడుతూ సీడ్స్ పరిశ్రమలో రెండుసార్లు విషవాయువులు లీకై వందలాదిమంది మహిళా కార్మికులు ఆసుపత్రి పాలయ్యారని గుర్తు చేశారు. గర్భిణులు, మహిళా కార్మికులు నేటికీ అనారోగ్య సమస్యలతో సతమతమవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా ప్రభుత్వం ఈ ప్రమాదంపై నివేదిక బయటపెట్టాలని, సేఫ్టీ ఆడిట్ నిర్వహించి ప్రమాదం జరగడానికి కారణాలు ఏమిటో బహిర్గతం చేయాలని డిమాండ్ చేశారు. భద్రత ప్రమాణాలు పాటించని యాజమాన్యంపై క్రిమినల్ చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిఐటియు మండల కార్యదర్శి కె.సోమినాయుడు, బాబూరావు, కె.చిరంజీవి, రామకృష్ణ, జగన్నాథం, అప్పలకొండ తదితరులు పాల్గొన్నారు.

ప్రేమ పేరిట మోసం చేసిన వ్యక్తిని అరెస్టు చేయాలని వినతి

ప్రజాశక్తి-వద్దాది : ప్రేమ పేరుతో మోసం చేసిన వ్యక్తిని, ఆయన తల్లిని అరెస్టు చేయాలని కోరుతూ రెల్లి మహిళ హక్కుల సాధన కమిటీ ఆధ్వర్యాన బుచ్చెయ్యపేట మండలం ఎల్‌బిపి అగ్రహారం, బంగారు మెట్ట గ్రామాల్లో అంబేద్కర్ విగ్రహాలకు శనివారం వినతపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా కమిటీ బుచ్చెయ్యపేట మండల అధ్యక్షురాలు ముత్యాల త్రివేణి మాట్లాడుతూ ఎలమంచిలి టౌన్ కాకివాని వీధికి చెందిన దళిత యువతి బంగారి లక్ష్మి, ఎలక్ట్రికల్ డిపార్ట్‌మెంట్‌లో పనిచేస్తున్న అగ్రకులానికి చెందిన అనిమిరెడ్డి ఆనంద్ కుమార్ ప్రేమించుకున్నారని తెలిపారు. పెళ్లి చేసుకుంటానని నమ్మించి, కొంత కాలం నమ్మకంగా ఉండి, తీరా పెళ్లి దాకా వచ్చేసరికి తక్కువ కులం దానివని, పెళ్లి కుదరదని ఆనంద్‌కుమార్ ముఖం చాటేశాడని పేర్కొన్నారు. దళిత యువతిని మోసం చేసిన ఆనంద్ కుమార్, ఆయన తల్లి తులసిని తక్షణమే అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. లేకుంటే జిల్లా కలెక్టర్ కార్యాలయం ఎదుట ఆందోళన చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో కమిటీ సభ్యులు లక్ష్మి, జ్యోతి, రమ, ఆదిలక్ష్మి పాల్గొన్నారు.

యువత భవిష్యత్తు కోసమే పాదయాత్ర

ప్రజాశక్తి- అనకాపల్లి : యువత భవిష్యత్తు కోసం తెలుగుదేశం పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ యువగళం పేరుతో 4వేల కిలోమీటర్ల పాదయాత్ర చేస్తున్నారని మాజీ ఎమ్మెల్యే పీలా గోవింద సత్యనారాయణ అన్నారు. గవరపాలెం పార్టీ కార్యాలయంలో శనివారం పాదయాత్ర పోస్టర్‌ను ఆయన ఆవిష్కరించారు. ఎన్ని అడ్డంకులు సృష్టించినా లోకేష్ పాదయాత్ర కొనసాగుతుందని తెలిపారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు మళ్ల సురేంద్ర, జోగి నాయుడు, సిదిరెడ్డి శ్రీనివాసరావు, మరపు రెడ్డి సత్యనారాయణ, తలారి లక్ష్మీప్రసాద్, మళ్ల సంతోష్, కరణం పవన్ కుమార్, ఆకుల నానాజీ, కె.రమణ పాల్గొన్నారు.

'లోకేష్ పాదయాత్రను అడ్డుకునేందుకే జిఒ 1'

ప్రజాశక్తి- అనకాపల్లి : టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ చేపట్టనున్న యువ గళం పాదయాత్రను అడ్డుకునే కుట్రలో భాగంగానే జగన్ రెడ్డి ప్రభుత్వం జిఒ 1 జారీ చేసిందని టిడిపి జిల్లా అధ్యక్షులు బుద్ద నాగజగదీశ్వరరావు ఆరోపించారు. రింగ్ రోడ్‌లోని పార్టీ కార్యాలయంలో శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ జిఒ 1ను హైకోర్టు సస్పెండ్ చేసినా సుప్రీం కోర్టులో పిల్ వేయడం జగన్ రెడ్డి బేలతనానికి నిదర్శనమన్నారు. జగన్ రెడ్డి పాదయాత్ర చేసే సమయంలో టిడిపి ఇటువంటి ఆంక్షలు విధిస్తే పాదయాత్ర సాగేదా? అని ప్రశ్నించారు. సమావేశంలో పార్టీ నాయకులు ధనాల విష్ణు చౌదరి, బోడి వెంకట్రావు పాల్గొన్నారు.

అప్పుల ఊబిలో రాష్ట్రం

ప్రజాశక్తి -బుచ్చెయ్యపేట : జగన్ రెడ్డి పాలనలో రాష్ట్రం అప్పుల ఊబిలో కూలిపోయిందని తెలుగుదేశం పార్టీ చోడవరం నియోజకవర్గం ఇన్‌ఛార్జి బత్తుల తాతయ్య బాబు అన్నారు. మండలంలోని పిపి అగ్రహారం, గొర్లెపాలెం, ఉప్పరగూడెం, గ్రామాలలో శనివారం రాత్రి ఇదేం కర్మ మన రాష్ట్రానికి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ రాష్ట్రం అన్ని రంగాలలోనూ అభివృద్ధి చెందాలంటే చంద్రబాబుతోనే సాధ్యమన్నారు. లోకేష్ పాదయాత్ర చారిత్రక ఘట్టమవుతుందన్నారు. ఈ కార్యక్రమంలో తెలుగు రైతు రాష్ట్ర ఉపాధ్యక్షులు గూనూరు మల్లు నాయుడు, పార్టీ మండల అధ్యక్షులు గోకివాడ కోటేశ్వరరావు, స్థానిక టిడిపి నాయకులు గుర్రం నూకరాజు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా గౌరీ పరమేశ్వరుల ఉత్సవం

దర్శించుకున్న పలువురు ప్రముఖులు

రథం లాతున్న ఉత్సవ కమిటీ సభ్యులు, ప్రముఖులు

ప్రజాశక్తి-అనకాపల్లి

ఉత్తరాంధ్రలో పేరుగాంచిన వేల్పుల వీధి శ్రీ గౌరీ పరమేశ్వర తీర్థ మహోత్సవం శనివారం ఘనంగా నిర్వహించారు. పలువురు ప్రముఖులు దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారి ఉత్సవ రథాన్ని కార్పొరేటర్ జాజుల ప్రసన్న లక్ష్మి రమేష్ దంపతులు, వైసిపి సీనియర్ నాయకులు డాక్టర్ జి.రామ్మూర్తి, లీడర్ పత్రిక అధినేత వివి రమణమూర్తి లాగి ఊరేగింపును ప్రారంభించారు. ఈ సందర్భంగా అమ్మవారిని పట్టణానికి చెందిన వేలాది మంది భక్తులు దర్శించుకొని తమ మొక్కులు తీర్చుకున్నారు. ఊరేగింపులో పలు నేలవేషాలు, సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. గౌరీ పరమేశ్వరులను దర్శించుకున్న వారిలో రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి గుడివాడ అమర్నాథ్, ఎంపీ డాక్టర్ బివి.సత్యవతి విష్ణుమూర్తి దంపతులు, మాజీ మంత్రులు దాడి వీరభద్రరావు, గంటా శ్రీనివాసరావు, మాజీ ఎమ్మెల్సీ పప్పల చలపతిరావు, మాజీ ఎమ్మెల్యే పీలా గోవింద సత్యనారాయణ, ఎంపీపీ గొర్లి సూరిబాబు, వైసిపి నాయకులు మందపాటి జానకి రామరాజు, దాడి రత్నాకర్, డిఆర్ఓ వెంకటరమణ, జోనల్ కమిషనర్ ఎస్ వెంకటరమణ, కార్పొరేటర్ పీల సౌజన్య రాంబాబు దంపతులు, పట్టణ సీఐ మోహన్ రావు, జనసేన నాయకులు ముక్క శ్రీనివాసరావు తదితరులు ఉన్నారు. ఉత్సవ కమిటీ అధ్యక్షులు బొద్దపు ప్రసాద్, ఉమామహేశ్వరరావు, రౌతు సతీష్, దొమరోతు రవి, చిరంజీవి, రమణ, గౌరీష్, వాకాడ బాబు, మద్దాల కూర్మారావు, బుదిరెడ్డ మురళి, దొండ వెంకటరమణ, కర్రి సత్తిబాబు పాల్గొన్నారు.

ఆర్ఇసిఎస్‌ను సహకార రంగంలోనే కొనసాగించాలి

సిపిఎం, రైతు సంఘం ధర్నా

ఇపిడిసిఎల్ కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న సిపిఎం, రైతు నాయకులు

ప్రజాశక్తి-అనకాపల్లి

కశింకోట గ్రామీణ విద్యుత్ సహకార సంస్థ (ఆర్ఇసిఎస్)ను సహకార రంగంలో కొనసాగించాలని సిపిఎం, రైతు సంఘం నాయకులు డిమాండ్ చేశారు. విద్యుత్ ట్రూ అఫ్ ఛార్జీలు, టారిఫ్ రేట్లుపై మూడు రోజులుగా ప్రజాభిప్రాయ సేకరణ జరుగుతున్న నేపథ్యంలో శనివారం సిపిఎం, రైతు సంఘం ఆధ్వర్యాన స్థానిక ఏపీఈపీడిసిఎల్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఏపీ రైతు సంఘం జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు కర్రి అప్పారావు, ఎం అప్పలరాజు, సిఐటియు జిల్లా నాయకులు వివి శ్రీనివాసరావు, గనిశెట్టి సత్యనారాయణ, వ్యకాస నాయకులు ఆళ్ల మహేశ్వరరావు, కె.రాము మాట్లాడుతూ ట్రూ అఫ్ ఛార్జీలు, టారిఫ్ రేట్ల మార్పుతో సామాన్య ప్రజలపై ఆర్థిక భారం పడుతుందన్నారు. వ్యవసాయ పంపుసెట్లకు మీటర్లు బిగించడం ద్వారా ఇప్పటికే సంక్షోభంలో ఉన్న వ్యవసాయ రంగం మరింత దిగజారుతుందని తెలిపారు. అనంతరం డిఈఈ కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. దీనిపై విద్యుత్ శాఖ అధికారులు సానుకూలంగా స్పందించారు. ఈ కార్యక్రమంలో సిఐటియు నాయకులు బ్రహ్మాజీ, దాకారపు శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

వాలంటీర్ల నియామకానికి దరఖాస్తుల స్వీకరణ

ప్రజాశక్తి- కె.కోటపాడు : మండలంలోని ఎ.కోడూరు, కె.కోటపాడు పంచాయతీ పరిధిలోని గ్రామ వాలంటీర్ల నియామకం కోసం దరఖాస్తు చేసుకోవాలని ఎంపీడీవో కాండ్రేగుల శశిదేవి కోరారు. ఆమె శనివారం స్థానిక విలేకరులతో మాట్లాడుతూ ఎ.కోడూరులో ఒక ఓసి, రెండవది బీసీ జనరల్, కె.కోటపాడులో ఓసి జనరల్ అభ్యర్థులు ఈ నెల 22, 23 తేదీలలో ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

తత్కాల్ రుసుముతో పదో తరగతి పరీక్ష ఫీజు చెల్లింపు

ప్రజాశక్తి-అనకాపల్లి : జిల్లాలోని అన్ని యాజమాన్యాల ఉన్నత పాఠశాలల విద్యార్థులు తత్కాల్ రుసుముతో 2023-24 విద్యా సంవత్సరం పదో తరగతి పరీక్ష ఫీజు చెల్లించి హాజరు కావచ్చని జిల్లా విద్యాశాఖ అధికారి బి.లింగేశ్వర్ రెడ్డి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రభుత్వ పరీక్షల విభాగం డైరెక్టర్ ఆదేశాల మేరకు రూ.500 తత్కాల్ రుసుముతో ఈనెల 23 నుంచి 26 వరకు, వెయ్యి రూపాయల తత్కాల్ రుసుముతో 27 నుంచి 31వ తేదీ వరకు ప్రధానోపాధ్యాయులు/ ప్రిన్సిపాల్ లాగిన్ ద్వారా చెల్లించవచ్చని పేర్కొన్నారు. ఇతర వివరాలకు www.bse.ap.gov.in ద్వారా తెలుసుకోవచ్చన్నారు.

పిఎసిఎస్‌ల ద్వారానే ధాన్యం అమ్మకాలు జరగాలి

ప్రజాశక్తి- మునగపాక రూరల్ : గతంలో మాదిరిగానే సహకార సంఘాల ద్వారా ధాన్యం అమ్మకాలు జరగాలని రైతులు విజ్ఞప్తి చేశారు. అనకాపల్లి వ్యవసాయ సహాయ సంచాలకులు ఎం రామారావు శనివారం మండలంలోని మునగపాక, నాగులపల్లి ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలను సందర్శించారు. ధాన్యం కొనుగోలు కేంద్రాలను పరిశీలించారు. రైతుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ ఫీల్డ్‌లో టెక్నికల్ అసిస్టెంట్ పరిశీలించిన తర్వాత నేరుగా మిల్లులకు ధాన్యం పంపిస్తున్నామని, అయితే ధాన్యంలో పలు లోపాలు ఉన్నాయని మిల్లర్లు అభ్యంతరాలు తెలపడంతో తిరిగి ఇళ్లకు తీసుకొచ్చే పరిస్థితి వస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. దీనిపై ప్రత్యేక చర్యలు చేపట్టాలని కోరారు. ఈ కార్యక్రమంలో మునగపాక పిఎసిఎస్ అధ్యక్షులు కోనపల్లి రామ్మోహన్ రావు, సీఈఓలు ఆడారి వేణుగోపాలకృష్ణ, మళ్ల స్వామి, రైతు సంఘం నాయకులు ఆడారి మహేష్, విఏఓలు కళ్యాణి, అనూష, రైతులు పాల్గొన్నారు.

గ్రామ కంఠంలో నివాసముంటున్న వారికి ఎల్‌పిసిలు

ప్రజాశక్తి- చోడవరం : చోడవరం పట్టణంలోని గ్రామకంఠంలో నివాసముంటున్న వారికి ఎల్‌పిసిలు మంజూరు చేస్తామని మండల తహశీల్దారు తిరుమల బాబు తెలిపారు. శనివారం మండల కార్యాలయంలో స్థానిక ఈవో నారాయణరావుతో కలిసి ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఎన్నో ఏళ్లగా చోడవరం పంచాయతీలో అనేకమంది పేదలు నివాసముంటున్నారని, వారికి ఇప్పటివరకు ఎటువంటి గుర్తింపు లేదని తెలిపారు. వారందరినీ గుర్తించి పంచాయతీ సహకారంతో ఎల్‌పిసిలు అందించి, పట్టాలు మంజూరు చేస్తామని చెప్పారు. ఇందుకోసం పట్టణంలో సర్వే జరుగుతుందన్నారు. సచివాలయం పరిధిలో అర్హులను గుర్తించి స్థానిక ఎమ్మెల్యే ధర్మ శ్రీ ఆదేశాల మేరకు పట్టాల మంజూరు చేస్తామని తెలిపారు.

వృద్ధురాలికి ఆర్థిక సాయం

ప్రజాశక్తి-సబ్బవరం : సబ్బవరం మేజర్ పంచాయితీ శివారు చిన్న గొల్లల పాలెం గ్రామానికి చెందిన వృద్ధురాలికి గొల్లల పాలెం గ్రామానికి చెందిన పల్లా సన్యాసిరావు, పల్లా తాతారావు, గొంప నారాయణరావు, పల్లా సత్యనారాయణ, పల్లా చిన్నారావు, పల్లా హరీష్, గొంప సంజీవరావు, గొంప ప్రసాద్ తదితరులు రూ.5వేలు నగదు, నెలకు సరిపడా నిత్యావసరాలు శనివారం అందజేశారు. వృద్ధురాలు ముత్యాలంబ అమ్మవారి ఆలయంలో పనిచేస్తుంది. దీనితో గ్రామానికి చెందిన పెద్దలు వృద్ధురాలికి ఆర్థిక సహాయం చేసి తమ ఉదారతను చాటుకున్నారు.

నేవీ నిర్వాసితుల సమస్యలపై చర్చలు

ప్రజాశక్తి-రాంబిల్లి : ఎన్ఎఒబి నిర్వాసితుల సమస్యలపై అనకాపల్లి జిల్లా కలెక్టర్ కార్యాలయంలో ఆర్డీవో చిన్నికృష్ణ, మత్స్యశాఖ జెడి లక్ష్మణరావు, నేవీ ఎస్పీసీ శనివారం కొత్త పట్నం, వాడ నరసాపురం, కొప్పిగుండపాలెం గ్రామాల పెద్దలతో చర్చలు జరిపారు. నిర్వాసితుల బోట్లకు రూ.6 లక్షలు ఇవ్వాలని, నెలకు రూ.14,300 చొప్పున ఐదు సంవత్సరాలు పరిహారం చెల్లించాలని నిర్వాసితులు కోరారు. దీనిపై అధికారులు మాట్లాడుతూ బోట్లకు రెండున్నర లక్షల రూపాయలు ఇస్తామని, ప్యాకేజీ విషయమై ఇంకా ఉన్నతాధికారులతో చర్చలు జరపాలని చెప్పారు. దీంతో నిర్వాసిత పెద్దలు తిరిగి వచ్చేశారు.

83వ రోజుకు ఆందోళన

తమ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ మండలంలోని వాడనర్సాపురం వద్ద నేవీ మెయిన్ గేటు ముందు 8 గ్రామాల నిర్వాసితులు చేస్తున్న ఆందోళన శనివారం నాటికి 83వ రోజుకు చేరింది. ఈ సందర్భంగా నిర్వాసిత జెఎసి నాయకులు మాట్లాడుతూ తమ సమస్యలు పరిష్కారమయ్యే వరకు ఉద్యమాన్ని ఆపేది లేదని స్పష్టం చేశారు.

రోడ్డు మరమ్మతులకు ఆర్థిక తోడ్పాటు

ప్రజాశక్తి-మునగపాక రూరల్ : అనకాపల్లి- అచ్యుతాపురం రోడ్డు మార్గంలో గుంతలను పూడ్చుతున్న ఆడారి రామకృష్ణకు ఆర్థిక తోడ్పాటుగా పాల్లి బ్రిక్స్ అధినేత ఆడారి అప్పలనాయుడు శనివారం రూ.5వేలు అందించారు. ప్రభుత్వం, అధికారుల నిర్లక్ష్యం, ప్రజాప్రతినిధుల అలసత్వం కారణంగా ఈ రోడ్డు విస్తరణ జరగక, గుంతలు పూడ్చకపోవడంతో ప్రయాణికుల ఇబ్బందులు వర్ణనాతీతం. ఈ నేపథ్యంలో మండలంలోని తిమ్మరాజుపేట గ్రామానికి చెందిన ఆడారి రామకృష్ణ తన సొంత నిధులతో క్రషర్ గ్రావెల్‌తో మరమ్మతు పనులు చేస్తున్న విషయం విధితమే. సుమారు 12 కిలోమీటర్ల మేర గుంతలు పూడ్చడానికి 40 లారీల క్రషర్ గ్రావెల్ పడుతుంది. ఇప్పటివరకు 20 లారీలతో కొంత మేరకు గుంతలను పూడ్చారు. మిగిలిన గుంతలను పూడ్చే పనులు జరుగుతున్నాయి. ఈ పరిస్థితుల్లో రామకృష్ణకు తోడ్పాటుగా అప్పలనాయుడుతో పాటు మాజీ ఎంపీటీసీ బెక్కలి పరశురాం, గ్రామస్తుల ఆడారి దానకర్ణ, మరికొంత మంది ఆర్థిక సహాయం అందజేశారు.

కార్మిక మహాగర్జన పోస్టర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి-చోడవరం : ఈ నెల 27న విశాఖలో జరిగే కార్మిక మహా గర్జనకు సంబంధించిన పోస్టర్‌ను శనివారం ఎఐటియుసి నాయకులు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆ సంఘం నాయకులు కోన లక్ష్మణ, రెడ్డిపల్లి అప్పలరాజు మాట్లాడుతూ కార్మిక మహాగర్జనకు మద్దతుగా ఈ నెల 23న చోడవరం తహశీల్దార్, 24, నర్సీపట్నం ఆర్‌డిఓ, 25న అనకాపల్లి జిల్లా కలెక్టర్ కార్యాలయాల వద్ద నిరసన కార్యక్రమాలు చేస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో సీపీఐ, ఏఐటియుసి నాయకులు నేయల హరి, బొబ్బిలి మణి తదితరులు పాల్గొన్నారు.

పార్కు అభివృద్ధికి ప్రణాళికలు

ప్రజాశక్తి- దేవరాపల్లి : మండల కేంద్రంలోని ప్రభుత్వ కార్యాలయాలకు సమీపంలో ఉన్న పార్కు అభివద్ధికి ప్రణాళికలు సిద్ధం చేయాలని వి.ఎంఆర్‌డిఏ అధికారులను ఉపముఖ్యమంత్రి బూడి ముత్యాల నాయుడు ఆదేశించారు. మండల కేంద్రంలో శనివారం ఆయన పర్యటించారు. దేవరాపల్లిలో చేపడుతున్న పలు అభివృద్ధి పనులను పర్యవేక్షించారు. పార్కును తీర్చిదిద్దాలనుకుంటున్న ప్రదేశాన్ని పరిశీలించారు. ఆయన వెంట వి.ఎంఆర్డీఏ అధికారులు జెసిపి.సింగ్, వి.రవిశంకర్, స్థానిక జలశయం ఏఈ సత్యనారాయుడు, ఎంపీడీవో సిహెచ్ సుబ్బలక్ష్మి, మాజీ ఎంపీపీ కిలపర్తి భాస్కరరావు తదితరులు ఉన్నారు.

నేడు బ్రాండిక్స్ ఆధ్వర్యాన ఉచిత కంటి వైద్య శిబిరం

ప్రజాశక్తి-అచ్యుతాపురం : బ్రాండిక్స్ ఇండియా అప్రల్ సిటీ ఆధ్వర్యంలో ఆదివారం 99వ ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు బ్రాండిక్స్ ఇండియా పాట్నర్ దొరస్వామి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకు వచ్చిన కంటి రోగులకు ఉచితంగా కంటి పరీక్షలు చేయడం జరుగుతుందని పేర్కొన్నారు. శంకర్ ఫౌండేషన్ వారి సహకారంతో నిర్వహిస్తున్న ఈ శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

చిత్రాడ జగదీష్ పదవీ కాలం పొడిగింపు

ప్రజాశక్తి-వడ్డాది : గాండ్ల తెలికుల వెల్ఫేర్ సొసైటీ రాష్ట్ర డైరెక్టర్‌గా బుచ్చయ్యపేట మండలం విజయరామరాజుపేటకు చెందిన చిత్రాడ జగదీష్ పదవీ కాలాన్ని మరోసారి పొడిగించారు. రెండు సంవత్సరాల నుండి జగదీష్ ఈ పదవిలో కొనసాగుతున్నారు. మరో రెండేళ్లపాటు రెన్యువల్ చేయడంపై జగదీష్ ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎమ్మెల్యే కరణం ధర్మశ్రీకి రుణపడి ఉంటానని తెలిపారు.

గిరిజన గ్రామాలకు రోడ్లు వేయాలి

-ఉప ముఖ్యమంత్రి సొంత నియోజకవర్గంలో ఆదివాసీల పట్ల కక్ష సాధింపు

-సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు వెంకన్న

ప్రజాశక్తి- దేవరాపల్లి

మాడుగుల నియోజకవర్గం పరిధిలోని గిరిజన గ్రామాలకు తక్షణమే రహదారుల సౌకర్యం కల్పించాలని సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు డి.వెంకన్న డిమాండ్ చేశారు. మండలంలోని వాలాబు పంచాయతీలో శనివారం పర్యటించిన వెంకన్న విలేకరులతో మాట్లాడారు. రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖమంత్రిగా ఉన్న డిప్యూటీ ముఖ్యమంత్రి బూడి ముత్యాలనాయుడు సొంత నియోజకవర్గంలోనే గిరిజన గ్రామాలకు రోడ్లు లేవని ఆక్షేపించారు. వాలాబు పంచాయతీలో అధికార పార్టీకి చెందిన సర్పంచ్ అభ్యర్థిని గిరిజనులు ఓడించారన్న కారణంతో వారిపట్ల కక్ష పూరితంగా వ్యవహరించడం, ఆ పంచాయతీ అభివృద్ధికి ఒక్క రూపాయి కూడా కేటాయించకపోవడం దారుణమన్నారు. నియోజకవర్గంలోని కెటి.పాలెం, బోర్రవింత, రామన్నపాలెం, కోడాపల్లి, పూలగరువు, బుచ్చంపాలెం, నగరంపాలెం, తాడిపూడి, కించుమండ, బోడిగరువు, నెరెళ్ళపూడి, మదనగరువు, వీరభద్రపేట తదితర గ్రామాల్లో కనీసం సౌకర్యాలు లేవని తెలిపారు. వైసిపిని గెలిపిస్తే రోడ్లు, మౌలిక సౌకర్యాలు కల్పిస్తామని చెప్పి ఓట్లు వేయించుకొని, ప్రభుత్వం వచ్చాక గెలిపించిన గిరిజనులు పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరించడం దారుణమన్నారు. ఇప్పటికైనా ఉప ముఖ్యమంత్రి స్పందించి గిరిజన గ్రామాలకు రోడ్లు వేయాలని వెంకన్న డిమాండ్ చేశారు.

అర్హులందరికీ ప్రభుత్వ పథకాలు

మహిళలతో మాట్లాడుతున్న ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ

ప్రజాశక్తి-చోడవరం

అర్హులైన వారికి ఇళ్లు, పింఛన్లు, ఇతర ప్రభుత్వ పథకాలను అందించేందుకు వైసిపి ప్రభుత్వం సిద్ధంగా ఉందని ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ అన్నారు. శనివారం చోడవరం పంచాయతీలో సచివాలయం-5 పరిధిలో గడపగడప మన ప్రభుత్వం కార్యక్రమాన్ని ఆయన చేపట్టారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ ఏడువాక సత్యారావు, ఎంపీపీ గాడి కాసు, ఎంపీడీవో ఎస్‌డి శ్యామ సుందర్, పంచాయతీరాజ్ డిఇ జివిఎస్ ప్రసాద్, వైస్ ఎంపీపీ పైన ఈశ్వరరావు కుమారి, స్థానిక సర్పంచ్ బండి నూకాలమ్మ శ్రీను, వైసిపి నాయకులు ఓరుగంటి నెహ్రూ, జ్యోతుల రమేష్, శివాలయం కమిటీ చైర్మన్ సత్యనారాయణ, వెంకటేష్, పందిరి శ్రీను, గుమ్మడి శ్రీను పాల్గొన్నారు.

కిడ్నీ వ్యాధిగ్రస్తులకు రూ.10వేలు ఆర్థిక సహాయం

అచ్యుతాపురం : మండలంలోని భోగాపురంలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని శనివారం ఎమ్మెల్యే కన్నబాబురాజు నిర్వహించారు. గ్రామంలోని తట్ట నూకరాజు కిడ్నీ వ్యాధితో బాధపడుతున్నాడని తెలుసుకొని, ఆయన వద్దకు వెళ్లి పరామర్శించి రూ.10వేలు ఆర్థిక సాయం అందించారు. తట్టవాని పాలెం, ఎరుకన్నపాలెం, జంగులూరు గ్రామాల్లోనూ ఆయన ఇంటింటికి వెళ్లి ప్రభుత్వ పథకాలు అందుతున్న తీరుపై ఆరా తీశారు. ఈ కార్యక్రమంలో జడ్పీటీసీ సభ్యుడు లాలం రాంబాబు, వైసిపి మండల శాఖ అధ్యక్షుడు దేశంశెట్టి శంకర్రావు, పార్టీ నాయకుడు కోన బుజ్జి, పి వాసు, లాలం పైడికొండ, ఎప్పి సన్యాసినాయుడు పాల్గొన్నారు.

ప్రమాణాలు పాటిస్తే ప్రమాదాలకు దూరం

ప్రజాశక్తి-చోడవరం

వాహనదారులు భద్రతా ప్రమాణాలను పాటిస్తే ప్రమాదాలకు దూరంగా ఉంటారని స్థానిక ఎమ్మెల్యే కరణం ధర్మశ్రీ అన్నారు. రోడ్డు భద్రత వారోత్సవాల్లో భాగంగా శనివారం స్థానిక ఉషోదయ డిగ్రీ కళాశాలలో ఆర్టిఐ అధికారులు సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ధర్మశ్రీ మాట్లాడుతూ వాహనాల సంఖ్య పెరిగిపోవడంతో, రోడ్లు విస్తరణ లేకపోవడంతో ప్రమాదాలు జరుగుతున్నాయని తెలిపారు. రోడ్లపై వాహనాన్ని స్పీడ్‌గా నడపడం వల్ల ఎక్కువ ప్రమాదాలు సంభవిస్తున్నాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ట్రాన్స్‌పోర్టు అధికారి వర్మ రాజు, మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ మురళీకృష్ణ, ఎంపీడీవో ఎస్డి శ్యామ్ సుందర్, ఎంపీపీ గాడి కాసు, వైస్ ఎంపీపీ బైన ఈశ్వరరావు పాల్గొన్నారు.

సబ్బవరం : రహదారి భద్రతా వారోత్సవాల్లో భాగంగా స్థానిక సీతారామ కళ్యాణ మండపంలో ఆటో డ్రైవర్లకు శనివారం రోడ్డు భద్రతపై స్థానిక సిఐ పి.రంగనాథం ఆధ్వర్యంలో అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డ్రైవర్లు రోడ్డు నిబంధనలను తప్పకుండా పాటించాలన్నారు. అనంతరం ఆటో డ్రైవర్లకు ఉచిత నేత్ర వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో స్థానిక ఎస్సై ఎల్. సురేష్ పలువురు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఆటో డ్రైవర్లకు కంటి పరీక్షలు చేస్తున్న వైద్యులు

బుచ్చయ్యపేట : మండలంలోని పి భీమవరం, బుచ్చయ్యపేట, ఆర్.శివరాంపురం తదితర గ్రామాల్లో రహదారి భద్రత వారోత్సవాలలో భాగంగా డ్వాక్రా సంఘాల సభ్యులు మండల మహిళా సమాఖ్య ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఏపీఎం బాలరాజు, డ్వాక్రా సంఘాల సభ్యులు పాల్గొన్నారు.

ఘనంగా తీర్థాలు

ప్రజాశక్తి-కశింకోట : మండలంలోని తాళ్లపాలెంలో శ్రీసీతారాముల వారి తీర్థం శనివారం ఘనంగా నిర్వహించారు. రంగులు రాట్నం, ఖర్జూరం, పంచదార చిలకలు, చిరు దుకాణాలు ప్రజలకు ఆకర్షణగా నిలిచాయి. ప్రత్యేక విద్యుత్ అలంకరణ చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ ప్రతినిధులు పాల్గొన్నారు.

ఎఎల్.పురంలో..

గొలుగొండ:ఏఎల్‌పురం మేజర్ పంచాయతీలో తీర్థ మహోత్సవం ఘనంగా జరిగింది. తీర్థంలో తప్పిడగుళ్ళు, తోడ పెద్దుల నృత్యాలు అలరించాయి.సర్పంచ్ లోచల సుజాత మాట్లాడుతూ, తీర్థ మహోత్సవమును ఇంత ఘనంగా నిర్వహించేందుకు సహకరించిన గ్రామ పెద్దలకు కృతజ్ఞతలు తెలియజేశారు.

'డిప్యూటీ సిఎం స్థాయి మరిచి మాట్లాడుతున్నారు'

ప్రజాశక్తి - కె.కోటపాడు : మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఆయన తనయుడు లోకేష్, మాజీ మంత్రి చింతకాయల అయ్యన్నపాత్రుడును విమర్శించి స్థాయి ఉప ముఖ్యమంత్రి బూడి ముత్యాలనాయుడుకు లేదని టిడిపి మాడుగుల నియోజకవర్గం ఇన్‌ఛార్జి పివిజి.కుమార్ అన్నారు. వారిపై బూడి చేసిన వ్యాఖ్యలు సంధి పేలావనకు నిదర్శనమన్నారు. స్థానిక టిడిపి కార్యాలయంలో శనివారం జరిగిన పార్టీ నాయకుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ మళ్లీ ఇటువంటి వ్యాఖ్యలు చేస్తే టిడిపి నాయకులు తగిన బుద్ధి చెబుతారని హెచ్చరించారు. బూడి తన నియోజకవర్గంలో ఇసుక, భూ దందాలు తప్ప ప్రజలకు చేసింది ఏమీ లేదన్నారు. ప్రతిపక్ష పార్టీల నాయకులను అణగదొక్కడానికి, లోకేష్ పాదయాత్రను అడ్డుకోవడానికి ప్రభుత్వం అడ్డగోలుగా జీవో నెంబర్ 1 తెచ్చిందని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షులు రొంగలి మహేష్, చౌడువాడ సర్పంచ్ దాడి ఎరుకనాయుడు, పార్టీ నాయకులు బత్తి వెంకటరమణ, సబ్బవరపు రామానాయుడు తదితరులు పాల్గొన్నారు.

మెరుగైన పరిహారం ఇవ్వాలి

ప్రజాశక్తి- మునగపాక రూరల్ : అనకాపల్లి- అచ్యుతాపురం రోడ్డు విస్తరణలో భూములు కోల్పోతున్న, తోటాడ రెవెన్యూ పరిధిలోని నిర్వాసితులకు మెరుగైన పరిహారం ఇవ్వాలని బాధిత రైతులు డిమాండ్ చేశారు. ఈ మేరకు మండలంలోని ఒంపోలులో నిర్వాసితుల సమావేశం శనివారం జరిగింది. ఈ సందర్భంగా నిర్వాసితుల సంఘం ప్రతినిధులు మాట్లాడుతూ తోటాడ రెవెన్యూ పరిధిలో భూములు కోల్పోతున్న రైతులు 110 మంది ఉండగా, ఇటీవల ఆర్డీవో చిన్నికృష్ణ 10, 15 మందితో తూతూ మంత్రంగా ఒంపోలులో సమావేశం నిర్వహించారని తెలిపారు. ఈ సందర్భంగా వ్యవసాయ భూములకు గజానికి రూ.6,148, వాణిజ్య భూములకు రూ.9,790 చొప్పున ప్రకటించిన పరిహారం ఆమోదయోగ్యం కాదని స్పష్టం చేశారు. నిర్వాసితులందరికీ ముందస్తు సమాచారం ఇచ్చి సమావేశం ఏర్పాటు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో నిర్వాసితులు బి.శ్రీరామ్మూర్తి, ఈశ్వర కుమార్, నూకరాజు, బి జయరాం, పైడికొండ, కృష్ణ, ఎస్ సత్యనారాయణ, ఎం జగన్నాధరావు, నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ఉక్కు ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా సంతకాల సేకరణ

ప్రజాశక్తి-అనకాపల్లి : విశాఖ స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా సిఐటియు ఆధ్వర్యంలో స్టీల్ ప్లాంట్ ఉద్యోగులు, సిఐటియు కార్యకర్తలు శనివారం అనకాపల్లి వేల్పుల వీధి గౌరీ పరమేశ్వరుల మహోత్సవం సందర్భంగా స్థానిక నెహ్రూ చౌక్ జంక్షన్‌లో సంతకాల సేకరణ చేపట్టారు. ప్రజలు, విద్యార్థులు, ఉద్యోగులు పెద్ద ఎత్తున పాల్గొని సంతకాలు చేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ బిజెపి ప్రభుత్వం స్టీల్ ప్లాంట్‌ను ప్రైవేటీకరిస్తే సహించేది లేదని హెచ్చరించారు. విశాఖ ఉక్కు ఆంధ్రుల హక్కు అనే నినాదంతో 32 మంది ప్రాణత్యాగాలతో ఏర్పడ్డ విశాఖ స్టీల్ ప్లాంట్ ను పరిరక్షించుకుంటామన్నారు. కార్యక్రమంలో సిఐటియు నాయకులు వివి శ్రీనివాసరావు, గనిశెట్టి సత్యనారాయణ, దాకారపు శ్రీనివాసరావు, ఎ.బాలకృష్ణ, చలపతి, స్టీల్ ప్లాంట్ ఉద్యోగులు బి శేష సాయి, కాండ్రేగుల రఘు పాల్గొన్నారు.

టిడిపి కార్యకర్తకు పైలా పరామర్శ

ప్రజాశక్తి- దేవరాపల్లి : రోడ్డు ప్రమాదంలో గాయపడి చికిత్స పొందుతున్న మండలం మారేపల్లి గ్రామానికి చెందిన టిడిపి కార్యకర్త కిల్లి ముత్యాల నాయుడును టిడిపి నియోజకవర్గం నాయకులు పైలా ప్రసాదరావు శనివారం పరామర్శించారు. విశాఖలోని సుశ్రుత ఈఎన్‌టి ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న ముత్యాల నాయుడు యోగ క్షేమాలు తెలుసుకుని, రూ.5 వేలు ఆర్థిక సాయంగా అందజేశారు. పార్టీ కార్యకర్తలకు తెలుగుదేశం ఎల్లప్పుడు అండదండలు అందిస్తుందని తెలిపారు.

నేడు మహిళల కబడ్డీ, వాలీబాల్ పోటీలు

ప్రజాశక్తి - రాంబిల్లి : మండలంలోని లాలం కోడూరు గ్రామంలో లాలం ఎరికిరెడ్డి నాయుడు తీర్థం సందర్భంగా ఈ నెల 22న ఆదివారం రాష్ట్ర స్థాయిలో మహిళల కబడ్డీ, వాలీబాల్ పోటీలు నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు, జెడ్పి మాజీ చైర్‌పర్సన్ లాలం భవాని భాస్కరరావు, లాలం చందు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా భోజనాలు, సాంస్కృతి కార్యక్రమాలు ఏర్పాటు చేశామని వెల్లడించారు.

డ్వాక్రా బుక్ కీపింగ్‌పై అవగాహన

ప్రజాశక్తి- కశింకోట : కశింకోట మహిళ సమాఖ్య కార్యాలయంలో శనివారం డ్వాక్రా సంఘాల బుక్ కీపింగ్‌పై సిఐబిలకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఏపిఎం శ్రీనివాసరావు బుక్ రాసే విధానం, రుణాలు, పొదుపు ఇతర అంశాలపై రాసే విధానం గురించి తెలియజేశారు. ఈ కార్యక్రమంలో హేమలత, శ్రీనివాసరావు పాల్గొన్నారు.

హుండి ఆదాయాన్ని లెక్కిస్తున్న సిబ్బంది

హుండీ లెక్కింపు

ప్రజాశక్తి-నర్సీపట్నంరూరల్:స్థానిక దుర్గా మల్లేశ్వర స్వామి దేవస్థానం హుండీల ఆదాయం 95 రోజులకు రూ.6,67,371లు వచ్చినట్లు ఆలయ ఛైర్మన్ చెరుకూరి సత్యనారాయణ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ, దేవాదాయ ధర్మాదాయ శాఖ కార్య నిర్వహణ అధికారి టి .సాంబశివరావు, ఛైర్మన్, ధర్మకర్తల ఆధ్వర్యంలో హుండీల లెక్కింపు శనివారం చేపట్టినట్లు తెలిపారు. శ్రీహరి సేవా సంఘం సభ్యులు, భక్తులు సహకారంతో లెక్కింపు ప్రక్రియ పూర్తి చేసామన్నారు. ఈ కార్యక్రమంలో పర్యవేక్షణ అధికారి ఆర్.శ్రీనివాసరావు, ధర్మకర్తలు కుమారి, మామిడి శ్రీనివాసరావు, వీఆర్వో కుమారి తదితరులు పాల్గొన్నారు.

ఒకేచోట కలుసుకున్న పూర్వ విద్యార్థులు

పూర్వ విద్యార్థుల కలయిక

ప్రజాశక్తి-గొలుగొండ:గొలుగొండ పాఠశాలలో 1999-2000 సంవత్సరంలో పదో తరగతి చదువుతున్న పూర్వ విద్యార్థులు శనివారం గొలుగొండ పాఠశాల, కళాశాల వద్ద అపూర్వ కలయిక నిర్వహించారు. ఈ సమావేశానికి సుమారుగా 40 మంది పూర్వ విద్యార్థులు హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ రామకృష్ణ హాజరయ్యారు. అనంతరం 1999-2000 పదో తరగతి విద్యార్థుల ద్వారా సంఘాన్ని ఏర్పాటు చేశారు. ఈ సంఘం ద్వారా సేవా కార్యక్రమాలు నిర్వహించాలని నిర్ణయం తీసుకున్నారు. సంఘం అధ్యక్షులుగా పెదపూడి రహణ, గొట్టాల అనీల్‌కుమార్, కోశాధికారిగా, సెక్రటరీగా గుడాల రాధాకృష్ణ, సంయుక్త కార్యదర్శిగా వంచదార్ల మాణిక్యం, వైస్ ప్రెసిడెంట్‌గా జి.సందీప్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ సంఘానికి స్టీరింగ్ కమిటీగా కె.ఆదిబాబు, డిఎల్.రాజు, డి.సత్యనారాయణ, డి.వరాహనరసింహమూర్తి, నూకరాజు, కన్నబాబు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

మోడల్ విలేజ్‌గా బి.సింగవరం

ఉప ముఖ్యమంత్రి బూడి

ప్రజాశక్తి-చీడికాడ:మండలంలో బి.సింగవరం గ్రామాన్ని మోడల్ విలేజ్‌గా తయారు చేస్తానని రాష్ట్ర ఉపముఖ్యమంత్రి బూడి ముత్యాలనాయుడు అన్నారు. మండలంలో బి.సింగవరం గ్రామంలో గడపగడపకు ప్రభుత్వ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఉపముఖ్యమంత్రి బూడి ముత్యాలయుడు ప్రతి ఇంటికెళ్లి ప్రభుత్వ పథకాల అమలుపై ఆరా తీశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, గ్రామాల్లో ప్రతి సమస్యను పరిష్కరించాలనే ఉద్దేశంతో ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి ఈ కార్యక్రమాన్ని ప్రవేశ పెట్టారన్నారు. ఇచ్చిన హామీలను అమలు పరిచిన ఘనత ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డికే దక్కిందన్నారు.ఈ కార్యక్రమంలో

మహిళతో మాట్లాడుతున్న బూడి

ఎంపిపి జయమ్మ, జడ్పిటిసి లాలం శారద వరలక్ష్మి జానకిరామ్, మండల వైసిపి కన్వీనర్ గొల్లవిల్లి రాజుబాబు, యూత్ కన్వీనర్ స్వామి నాయుడు, సర్పంచ్ శరగడం సన్యాసి నాయుడు, వైసిపి నాయకులు ఎర్ర అప్పారావు, శరగడం జయ రామ కృష్ణ పాల్గొన్నారు

415వ రోజుకు మత్స్యకారుల ధర్నా

ప్రజాశక్తి -నక్కపల్లి:హెటిరో ఫైప్ లైన్ కు వ్యతిరేకంగా మత్స్యకారులు తలపెట్టిన శాంతియుత మహాధర్నా శనివారం నాటికి 415వ రోజుకు చేరింది. ఈ సందర్భంగా ఏపీ మత్స్యకార జేఏసీ జిల్లా అధ్యక్షులు పిక్కి స్వామి మాట్లాడుతూ, కంపెనీ వ్యర్ధ జలాలు సముద్రంలోకి వదలడంతో మత్స్య సంపద నశించి పోతుందన్నారు. దీంతో, మత్స్యకారులు ఉపాధి కోల్పోయారని, కంపెనీ కాలుష్యం కారణంగా అనేకమంది మత్స్యకారులు రోగాల బారిన పడ్డారని తెలిపారు. పైప్ లైన్‌కు వ్యతిరేకంగా 415 రోజుల నుండి శాంతియుతంగా ఆందోళన చేస్తున్నప్పటికీ ప్రభుత్వం, జిల్లా అధికార యంత్రాంగం, స్థానిక ఎమ్మెల్యే సమస్య పరిష్కారానికి మార్గం చూపకపోవడం దారుణమన్నారు. సమస్య శాశ్వతంగా పరిష్కారమయ్యే వరకు ఆందోళన కొనసాగిస్తామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో ఏపీ మత్స్యకార జేఏసీ విద్యార్థి ప్రధాన కార్యదర్శి వాసపల్లి నూకరాజు, మత్స్యకారులు కారే రాజు, కె.జగ్గా పాల్గొన్నారు.

నినాదాలు చేస్తున్న మత్స్యకారులు

ఏపిజివిబి సేవలపై అవగాహన

ప్రజాశక్తి -ఎస్.రాయవరం:ఏపిజివిబి బ్యాంక్ సేవలను

అవగాహన కల్పిస్తున్న మేనేజర్

ఖాతాదారులు, రైతులు వినియోగించుకోవాలని బ్రాంచి మేనేజర్ కె.సూర్యభాస్కర్‌రావు తెలిపారు. మండల కేంద్రమైన ఎస్.రాయవరం గ్రామంలో బ్యాంకు అందిస్తున్న సేవలపై స్థానిక విలేకరులతో మాట్లాడారు. ఒక గ్రాము బంగారానికి రూ.3950 రుణం ఇవ్వడమే కాకుండా అతి తక్కువ వడ్డీకే ఇవ్వడం జరుగుతుందన్నారు. అతి తక్కువ పెట్టుబడితో అటల్ పెన్షన్ యోజన అందుబాటులో ఉందన్నారు. రూ.20లకే ప్రధానమంత్రి సురక్ష యోజన ద్వారా 2 లక్షల ప్రమాద భీమా వర్తిస్తుందని పేర్కొన్నారు. రూ.436కే ఒక సంవత్సరం పాటు ప్రధానమంత్రి జీవన జ్యోతి భీమా యోజన ద్వారా రూ.2 లక్షల జీవిత భీమా వర్తిస్తుందన్నారు.ఈ కార్యక్రమంలో పలువురు సిబ్బంది పాల్గొన్నారు.

వెంకన్న ఆలయంలో పూజలు

ప్రజాశక్తి-నక్కపల్లి:తెలుగుదేశం పార్టీ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ యువగళం పేరుతో ఈనెల 27 నుంచి చేపట్టబోయే పాదయాత్ర విజయవంతం అవ్వాలని కోరుతూ నియోజకవర్గ తెలుగు మహిళా అధ్యక్షురాలు మల్లపురెడ్డి రమా కుమారి ఆధ్వర్యంలో మహిళలు ప్రత్యేక పూజలు చేశారు. మండలంలోని ఉపమాక వెంకన్న ఆలయంలో లోకేష్ పేరిట ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో మహిళలు కర్రి లోవలక్ష్మి, వెదుళ్ల పద్మ, బుజ్జి, గూడుపు నాగమణి, వెంకటలక్ష్మి, తెలుగుదేశం పార్టీ మండల శాఖ అధ్యక్షులు కొప్పిశెట్టి వెంకటేష్, పార్టీ నాయకులు కొప్పిశెట్టి బుజ్జి, ప్రగడ వీరబాబు, కొంకిపూడి దొరబాబు, తోలేటి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

పూజలు చేస్తున్న టిడిపి నేతలు

అవగాహన కల్పిస్తున్న ఏరో స్పేస్ సిబ్బంది

పొలాల్లో డ్రోన్ స్ప్రేపై అవగాహన

ప్రజాశక్తి -నక్కపల్లి:మండలంలోని దేవవరం పంచాయితీ ఒడ్డిమెట్టలో శనివారం వ్యవసాయ, ఉద్యానవన శాఖల ఆధ్వర్యంలో గరుడ ఎరో స్పేస్ సహకారంతో డ్రోన్ స్ప్రే పై అవగాహన కల్పించారు. పంట పొలాల్లో డ్రోన్ స్ప్రే డెమో నిర్వహించారు. ఈ సందర్భంగా సీఈఓ గింజాల అప్పారావు మాట్లాడుతూ, పది లీటర్ల కెపాసిటీ గల డ్రోన్ 4 లక్షల 50 వేలు ఉంటుందని, రైతులకు 50 శాతం సబ్సిడీపై అందించడం జరుగుతుందన్నారు. ఇది రైతులకు ఉపయోగకరంగా ఉంటుందన్నారు. డ్రోన్ స్ప్రేకు సంబంధించి శిక్షణ ఇవ్వడం జరుగుతుందని, ఆసక్తి గలవారు శిక్షణ పొందిన వెంటనే ఉద్యోగ అవకాశం లభిస్తుందన్నారు.

వంట సామగ్రి అందిస్తున్న సూపరింటెండెంట్

బాధితులకు వంట సామగ్రి వితరణ

ప్రజాశక్తి-రోలుగుంట:రోలుగుంట మండలం చటర్జీపురంలో అగ్ని ప్రమాదంలో రెండు గృహాలు దగ్ధమైన బాధితులకు నర్సీపట్నం ఏరియా ఆసుపత్రి నర్సింగ్ సూపరింటెండెంట్ పద్మావతి సామగ్రిని అందజేశారు. పద్మావతితో పాటు విశాఖ స్టీల్ ప్లాంట్‌లో పని చేస్తున్న సుధీర్ స్పందించి బాధితులకు నగదు, వంట సామాగ్రి, బట్టలు, రగ్గులు. తదితర వస్తువులు సమకూర్చి తమ ఉదారతను చాటుకున్నారు.

ఇసుక అక్రమ రవాణాపై ఫిర్యాదు

ప్రజాశక్తి -మాకవరపాలెం: మండలంలో అనుమతులు లేకుండా ఇసుకను అక్రమంగా రవాణా చేస్తున్నారని, వీరిపై చర్యలు తీసుకోవాలని టిడిపి మండల పార్టీ అధ్యక్షుడు ఆర్వై పాత్రుడు ఆధ్వర్యంలో ఎస్సై రామకృష్ణారావుకి ఫిర్యాదు చేశారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, తూటిపాల, జంగాలపల్లి గ్రామాల్లో ఇసుక అక్రమణ రవాణా చేస్తున్నారని, దీని పై చర్యలు చేపట్టాలన్నారు. తూటిపాల గ్రామంలో సర్వే నెంబరు 297 జిరాయితి భూమిలో ఇసుకను రవాణాకు పాల్పడుతున్న అధికార పార్టీ నాయకులు సొమ్ము చేసుకుంటున్నారన్నారు. జంగాలపల్లి గ్రామం లోని సర్పా నదిలో రాత్రి సమయంలో ఇసుక భారీగా తరలిస్తున్నారని, దీంతో భూగర్భ జలాలు పూర్తిగా దెబ్బతింటున్నాయన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు అల్లు రామనాయుడు, వి.గోవింద, కోడూరు శ్రీనివాసరావు, కోసూరు శ్రీనివాసరావు పాల్గొన్నారు.

ఫిర్యాదు చేస్తున్న టిడిపి నేతలు

'రుణాల రికవరీ ఏదీ'?

ప్రజాశక్తి-రోలుగుంట:అనకాపల్లి డిఆర్‌డిఎ పరిధి రోలుగుంట మండలం వెలుగు వికలాంగుల సమాఖ్యలో రూ.40లక్షల రుణాలు రికవరీ చేయక పోవడంపై విచారణ జరిపి బాధ్యులపై తగిన చర్యలు తీసుకొని సొమ్ము రికవరీ చేయాలని ప్రజాస్వామ్య పరిరక్షణ ఐక్యవేదిక కన్వీనర్ దుల్లా వీరబాబు డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, అనకాపల్లి జిల్లా డిఆర్‌డిఎ అక్రమార్కులకు అడ్డాగా మారిందని, ప్రభుత్వ సొమ్ము దుర్వినియోగం అవుతున్నా అధికారులు ఏమీ పట్టనట్టు వ్యవహరిస్తున్నారని విమర్శించారు. రూ.40లక్షల రుణాలు ఇచ్చి ఎన్నో సంవత్సరాలు అవుతుందని, ఇప్పటికీ రికవరీ చేయకపోవడం వెనుక ఆంతర్యం ఏమిటని ప్రశ్నించారు. రూ.40లక్షలు రుణాలు పొందిన వారి వివరాలు బహిరంగ పరచి విచారణ జరపాలని, దీంతో అసలు విషయాలు వెలుగులోకి వస్తాయన్నారు. స్త్రీనిధి రుణాల్లో కూడా అక్రమాలు జరుగుతున్నాయని, ఇప్పటికే కొన్ని చోట్ల వెలుగులోకి వచ్చాయని తెలిపారు.

వేగంగా గృహాల నిర్మాణాలు

- జగనన్న లే అవుట్ల పరిశీలనలో అధికారులు

ప్రజాశక్తి-నక్కపల్లి:త్వరితగతిన గృహ నిర్మాణాలు పూర్తి చేయాలని ఎంపీడీవో సీతారామరాజు సూచించారు. మండలంలోని శనివారం హౌసింగ్ డే సందర్భంగా చినతీనార్ల, ఉపమాక గ్రామాల్లో జగనన్న లేఅవుట్ లను హౌసింగ్ అధికారులు, ఇంజనీరింగ్ అసిస్టెంట్ లతో కలిసి సందర్శించారు. గృహ నిర్మాణ పనులను పరిశీలించారు. వేగవంతగా నిర్మాణ పనులు పూర్తి చేయాలన్నారు. గృహ నిర్మాణ పనులు ప్రారంభించని లబ్ధిదారులతో మాట్లాడి అవగాహన కల్పించారు. లేఅవుట్‌లలో అన్ని సౌకర్యాలు కల్పిస్తామని, లబ్ధిదారులు వెంటనే నిర్మాణాలు ప్రారంభించాలన్నారు.

గొలుగొండ:మండలంలోని జోగంపేట గ్రామంలో సర్పంచ్ జువ్వల లక్ష్మి, వైస్ ఎంపిపి నాగమణి ఆధ్వర్యంలో జగనన్న హౌసింగ్ లబ్ధిదారులతో సమావేశం నిర్వహించారు. తమకు వేరొక చోట జగనన్న కాలనీ ఇస్తే అక్కడ నిర్మాణం చేస్తామని లబ్ధిదారులు చెప్పారు. అనంతరం తహశీల్దార్ ఆనంద్ మాట్లాడుతూ, గతంలో మంజూరు చేసిన 47 మంది లబ్ధిదారుల్లో ఎంతమందికి జగనన్న హౌసింగ్ కాలనీ కావాలో సోమవారం వచ్చి చెప్పాలని సూచించారు. లేఅవుట్ వేసిన తర్వాత హౌసింగ్ కావాలని వస్తే కుదరదన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఒ డేవిడ్‌రాజు, ఏపిఎం మంగ, వివిధ శాఖల సిబ్బంది, జోగంపేట ఉప సర్పంచ్ లాలం స్వామినాయుడు, వైసిపి నాయకులు దేముడు పాల్గొన్నారు.

కోటవురట్ల:జగ్గంపేట, కైలాసపట్నం గ్రామాల్లో తహసిల్దార్ జానకమ్మ, ఎంపీడీవో చంద్రశేఖర్‌లు జగనన్న ఇళ్ల నిర్మాణాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఎంపిడిఓ చంద్రశేఖర్ మాట్లాడుతూ, గృహ నిర్మాణాలు వేగవంతంగా పూర్తి చేయాలని సంబంధిత అధికారులకు సూచించారు. తహశీల్దార్ జానకమ్మ మాట్లాడుతూ, లబ్ధిదారులకు సకాలంలో గృహ నిర్మాణ సామగ్రి అందించి, బిల్లులు చెల్లించాలని హౌసింగ్ ఇంజనీర్ జగదీశ్వరరావుకు సూచించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీరాజ్ ఇంజనీర్ వర్మ, ఆర్‌డబ్ల్యుఎస్ ఇంజనీర్ కరుణ, జగంపేట సర్పంచ్ రమణ, కైలాసపట్నం ఎంపిటిసి సభ్యులు వెంకట రమణ, ఈఓపిఆర్‌డి ప్రేమ్ కుమార్, కైలాసపట్నం ఉపసర్పంచ్ నాగేశ్వరరావు పాల్గొన్నారు.

కోటవురట్ల మండలంలో పర్యటిస్తున్న అధికారులు

గృహోపకరణాలు దగ్ధం

ప్రజాశక్తి-కొత్తకోట:రావికమతం మండలం జెడ్. బెన్నవరం శివారు కిత్తం పేటలో శుక్రవారం రాత్రి జరిగిన విద్యుత్ షార్ట్ సర్క్యూట్ సంఘటనలో సుమారు రూ.50 వేల విలువైన గృహోపకరణ వస్తువులు ఖాళీ బూడిదయ్యాయి. గ్రామానికి చెందిన సేనాపతి శ్రీను ఇంటిలో శుక్రవారం రాత్రి విద్యుత్ మీటర్ నుంచి ఒక్కసారిగా మంటలు చెలరేగి వ్యాప్తి చెందడంతో శ్రీను కుటుంబ సభ్యులు బయటకు పరుగులు తీశారు. ఈ ప్రమాదంలో గృహోపకరణ వస్తువులైన టివి, ప్రిజ్, దుస్తులు, తదితర వస్తువులు ఖాళీ బూడిదయ్యాయి.ఈ సంఘటనలో ఎవ్వరికి ఎటువంటి ప్రమాదం జరగలేదు. శ్రీను కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని పలువురు కోరుటన్నారు జడ్పిటిసి తలారి రమణమ్మ ఆదిమూర్తి బాధితున్ని ఆదు కునేందుకు తహసీల్దార్ మహేశ్వరరావు సంప్రదించి నట్టు చెప్పారు.

దగ్ధమైన గృహోపకరణాలు

K. SATYANARAYANA REDDY (RAGHU)
CHAIRMAN: APIIC-IALA & M/s ADI ENTERPRISES

KOLLI ESWAR RAO VICE CHAIRMAN: APIIC-IALA & M/s. SRI BHAVANI WIRE INDUSTRIES	CHEEKATI SATYANARAYANA (CSN) SECRETARY: APIIC-IALA & M/s. SRI SAI RAM INDUSTRIES
GUDURI RAMA KRISHNAM RAJU JOINT SECRETARY: APIIC-IALA & M/s. PEGASUS GRANITES LLP	Smt. P. PADMAVATHI TREASURER: APIIC-IALA & M/s. PRIMULA FLEXOPACK PVT. LTD.
R. RAJANIKANTH IALA, CHAIRMAN, AKP LOHMAN CASTINGS- KOTHUR INDUSTRIAL ESTATE	A.K. BALAJI PRESIDENT: VASSIWA LALITHA METALS, AUTONAGAR VISAKHAPATNAM
SUMAN PRAKASH SARAOJI & SOURAB S P BAILING PRESS, D-BLOCK, AUTONAGAR.	CVS PRASAD & C. RAMAKANTH D-BLOCK IALA MEMBER, SVS GROUP OF INDUSTRIES
SRINIVAS SRIKANYA IRON & STEEL PRIVATE LIMITED, E BLOCK, AUTONAGAR.	RAMAKRISHNA NARAPUREDDY *Pratap Industries* VASSIWA FOUNDER PRESIDENT, AUTONAGAR

ఉపాధ్యాయులకు కనీస బాధ్యత ఏదీ?

కనీసం క్లాస్ వర్క్‌లను పరిశీలించరా..
విద్యాశాఖ ముఖ్య కార్యదర్శి ప్రవీణ్ ప్రకాష్ ఆగ్రహం

ప్రజాశక్తి నర్సీపట్నం టౌన్ :ఇంత ఉన్నత చదువులు చదివి విద్యార్థులను విద్యావంతులుగా తీర్చిదిద్దాల్సింది పోయి కనీస బాధ్యత లేకుండా వ్యవహరించడం పట్ల విద్యాశాఖ ముఖ్య కార్యదర్శి ప్రవీణ్ ప్రకాష్ ఆగ్రహం వ్యక్తం చేశారు. పట్టణంలోని పాఠశాలలను ఆకస్మికంగా శనివారం సందర్శించారు. పెద్ద బొడ్డేపల్లిలో ప్రభుత్వ పాఠశాలలో ఆరవ తరగతి విద్యార్థులను ప్రశ్నలు అడిగారు. వర్క్ బుక్‌లో క్లాస్ వర్క్‌ను ఉపాధ్యాయిరాలు కనీసం తనిఖీ చేయక పోవడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇంటిదగ్గర మీ పిల్లలు హెూమ్ వర్క్‌ని కూడా ఈ విధంగానే పరిశీలిస్తున్నారా అని ప్రశ్నించారు. క్లాస్ వర్క్, హెూంవర్క్‌లు పరిశీలించకపోవడాన్ని చూస్తుంటే చదువులపై శ్రద్ధ చూపడం లేదనేది అర్థం అవుతుందని ఆయన అన్నారు. కొంతమంది విద్యార్థులు నేలపై కూర్చోవడంతో బెంచీలు ఏమయ్యాయని ప్రశ్నించారు. బెంచీలు దెబ్బ తినడంపై అధికారులను నిలదీశారు. నూతన బల్లలను ఏర్పాటు చేయాలన్నారు. జనవరి ముగుస్తున్నా ఇంకా సిలబస్ పూర్తి చేయకపోవడం పట్ల సంబంధిత ఉపాధ్యాయురాయులపై మండిపడ్డారు. పాఠశాలలో శుద్ధ జల ప్లాంట్‌పై డీఈలకు మెమోలు ఇవ్వాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. నాడు నేడులో భాగంగా నిర్మిస్తున్న పాఠశాల భవనం పట్ల అసంతృప్తి వ్యక్తం చేశారు.

అనంతరం నర్సీపట్నంలో పలు పాఠశాలలను విద్యాశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ ప్రవీణ్ ప్రకాష్ తనిఖీ చేశారు. పాఠశాలలో ఉపాధ్యాయులు ఇప్పటివరకు విద్యార్థులకు బుక్స్ సరిగ్గా ఎందుకు ఇవ్వలేదని ప్రశ్నించారు. సమయానుకూలంగా సిలబస్ ఇప్పటికీ పూర్తి కాక పోవడంపై అసహనం వ్యక్తం చేశారు. కనీసం 25శాతం పిల్లలు కూడా చదువుతున్నట్లు కనపడలేదన్నారు. ఉపాధ్యాయులు తీరు ఈ విధంగా ఉంటే ఉపేక్షించేది లేదన్నారు.' నా సహనాన్ని మీరు పరీక్షించొద్దని ఆయన అలాగే చెబుతారులే అని అనుకుంటే చర్యలు తప్పవన్నారు. స్థానిక ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో నాడు నేడు పనులపై జిల్లా వృత్తి విద్య అధికారి మురళీధర్‌ను ఆరా తీశారు. నవంబర్ వరకే వివరాలు తెలియజేయడంతో ఆగ్రహం వ్యక్తం చేశారు. నాడు నేడు పనులపై సరైన సమాధానం చెప్ప లేకపోవడంతో ఏఈ రమణాజీపై అసహనం వ్యక్తం చేశారు.

ఉపాధ్యాయులపై అసహనం వ్యక్తం చేస్తున్న ప్రవీణ్ ప్రకాష్

విద్యార్థులతో ముచ్చటిస్తున్న ప్రవీణ్ ప్రకాష్

'అరెస్టు చేయాలి'

ప్రజాశక్తి-నర్సీపట్నం రూరల్: అనకాపల్లి జిల్లా యలమంచిలి టౌన్‌లో దళిత మహిళ బంగారు లక్ష్మిని ప్రేమ, పెళ్లి పేరుతో నమ్మించి మోసం చేసిన ఎలక్ట్రికల్ డిపార్టుమెంట్లో పని చేస్తున్న అనిమిరెడ్డి ఆనంద్ కుమార్, ఆమె తల్లి తులసిలను తక్షణమే అరెస్టు చేయాలని రెల్లి మహిళ హక్కుల సాధన కమిటీ జిల్లా అధ్యక్షురాలు యర్రంశెట్టి మౌనిక డిమాండ్ చేశారు. శనివారం ఆమె స్థానిక విలేకరులతో మాట్లాడుతూ, మహిళలపై అత్యాచారాలు, మోసాలు అధికమవు తున్నాయన్నారు. కఠిన చట్టాలు ఉన్నప్పటికీ అమలు చేయడంలో అధికారులు విఫలమవుతున్నారన్నారు. ఇటువంటి సంఘటనలు పునరావృతం కాకుండా ఉండాలంటే కఠిన చర్యలు చేపట్టాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మహిళ సంఘం నాయకులు వరలక్ష్మి, ఈశ్వరి తదితరులు పాల్గొన్నారు.

టేకు చెట్టు నరికివేత

ప్రజాశక్తి-గొలుగొండ:కృష్ణదేవిపేట ఫారెస్ట్ రేంజ్ పరిధిలో ఉన్న కొయ్యూరు మండలం నల్లగొండ అటవీ ప్రాంతం ప్రభుత్వ టేకు ప్లాంటేషన్ లో అక్రమంగా చొరబడి ఓ ఇద్దరు వ్యక్తులు ఒక టేకు చెట్టును నరికి వేశారు. డిఆర్‌ఓ రాజేష్, బేస్ క్యాంప్ సిబ్బంది సహకారంతో శనివారం తెల్లవారుజాము 4 గంటల సమయంలో చాకచక్యంగా వీరిని పట్టుకున్నారు. రేంజర్ ఆదేశాల మేరకు 15 రోజులు రిమాండ్‌కు తరలించినట్టు డిఆర్‌ఓ రాజేష్ తెలిపారు.

660వ రోజుకు ఉక్కు జెఏసి దీక్షలు

ప్రజాశక్తి - కలెక్టరేట్ : విశాఖ స్టీల్‌ప్లాంట్‌కు భూములు ఇచ్చిన రైతుల కుటుంబాల్లో నేటి వరకూ ఉపాధి లభించని వారికి మిగులు భూములను పంపిణీ చేయాలని సంప్రదాయ మత్స్యకారుల యూనియన్ (సిఎఫ్‌టియుఐ) రాష్ట్ర ఆర్గనైజింగ్ కార్యదర్శి కె.లక్ష్మి డిమాండ్ చేశారు. స్టీల్‌ప్లాంట్, ఇతర ప్రభుత్వ రంగ సంస్థల ప్రైవేటీకరణను వ్యతిరేకిస్తూ జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద విశాఖ అఖిలపక్ష కార్మిక, ప్రజా సంఘాల జెఏసి ఆధ్వర్యాన చేపట్టిన దీక్షలు శనివారానికి 660వ రోజుకు చేరాయి. దీక్షల్లో సిఎఫ్‌టియుఐకి చెందిన మత్స్యకార మహిళలు కూర్చున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ త్యాగాలతో ఏర్పడ్డ స్టీల్‌ప్లాంట్‌ను ప్రైవేటీకరించడం దారుణమన్నారు. మోడీ సర్కారు తన నిర్ణయాన్ని మార్చుకోకుంటే పోరాటాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు. దీక్షల్లో ఎం.లక్ష్మి, ఎం.దుర్గ, జి.బాలు, రఘు, జి.లక్ష్మి, ఎం.ఎర్రమ్మ, లోకమ్మ, రమ్య పాల్గొన్నారు.

ఎఐటియుసి ఆధ్వర్యాన పోస్టర్ ఆవిష్కరణ

విశాఖ స్టీల్‌ప్లాంట్‌ను ప్రైవేటీకరణ చేయరాదంటూ ఈ నెల 30న ఉక్కు నగరంలో లక్ష మందితో జరగనున్న ఉక్కు ప్రజా గర్జన బహిరంగ సభను జయప్రదం చేయాలని ఎఐటియుసి నాయకులు పిలుపునిచ్చారు. శనివారం సంఘం విశాఖ జిల్లా సమితి ఆధ్వర్యంలో జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద ప్రజా గర్జన సభ పోస్టర్‌ను నేతలు ఆవిష్కరించారు. జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పడాల రమణ, బిసిహెచ్.మసేన్ మాట్లాడారు. ఉక్కు ప్రైవేటీకరణను వ్యతిరేకిస్తూ రాష్ట్రవ్యాప్తంగా ఈ నెల 23, 24 తేదీల్లో ఆర్‌డిఓ కార్యాలయాల ఎదుట, 25న కలెక్టరేట్ల వద్ద ధర్నాలు, నిరసన కార్యక్రమాలు నిర్వహించనున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో ఎం.మన్మధరావు, రెహమాన్ పాల్గొన్నారు.

దీక్షలో కూర్చున్న మత్స్యకార మహిళలు

ఔత్సాహిక పారిశ్రామికవేత్తలకు ప్రోత్సాహం

ప్రజాశక్తి-ఎంవిపి.కాలనీ : జిల్లాలో పరిశ్రమల ఏర్పాటుకు ఔత్సాహిక పారిశ్రామికవేత్తలను ప్రోత్సహించాలని, పరిశ్రమల స్థాపనతోనే జిల్లా ఆర్థిక ప్రగతి సాధిస్తుందని విశాఖ జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎ.మల్లికార్జున అన్నారు. శనివారం ఉదయం కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఇండస్ట్రియల్ అండ్ ఎక్స్పోర్ట్ ప్రమోషన్ కమిటీ జిల్లా స్థాయి సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెల 19వ తేదీ నాటికి సింగిల్ డెస్క్ పోర్టల్‌లో 152 దరఖాస్తులు రాగా అందులో 121 దరఖాస్తులను నిర్దేశించిన గడువులోగా ఆమోదించామని, నాలుగు దరఖాస్తులను తిరస్కరించామని తెలిపారు. మిగిలిన 27 దరఖాస్తులు ఎస్-ఎల్‌ఎ పరిధిలో పెండింగ్‌లో ఉన్నాయని వివరించారు. గాజువాకలో నిర్మిస్తున్న కార్మిక రాజ్య బీమా ఆసుపత్రికి సంబంధించి అన్ని అనుమతులూ సత్వరం మంజూరు చేయాలని అధికారులను ఆదేశించారు.

మధ్యాహ్న భోజనంపై ఆరా

ప్రజాశక్తి రావికమతం :మండలంలో గుమ్మాలపాడు ప్రాథమిక పాఠశాల, అంగన్వాడీ కేంద్రాలను సర్పంచు బంటు సన్యాసినాయుడు శనివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ప్రాథమిక పాఠశాలలో, అంగన్వాడి కేంద్రాలలో మధ్యాహ్న భోజనం మెనూపై ఆరా తీశారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ మధ్యాహ్న భోజనం నిర్వాహకులు విద్యార్థులకు రుచికరమైన వంటకాలను తయారుచేసి పెట్టాలన్నారు.

భోజనాన్ని పరిశీలిస్తున్న సర్పంచ్